www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 1 మే 2024

8 పేజీలు

ఏలూరు పశ్చిమ గోదావరి

నేడు ఏలూరులో సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ప్రచారంలో భాగంగా సిఎం జగన్ బుధవారం ఏలూరులో పర్యటించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు సిఆర్ఆర్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం గుండా ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో సిఎం మాట్లాడతారు. అనంతరం తిరిగి హెలీకాప్టర్‌లో బయలుదేరి వెళ్తారు. సిఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఏలూరు స్పోర్ట్స్: ముఖ్యమంత్రి జగన్ నగర పర్యటనలో భాగంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి మంగళవారం స్వయంగా పరిశీలించారు. సిఆర్‌రెడ్డి కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను తొలుత ఆమె పరిశీలించారు అనంతరం ఫైర్ స్టేషన్ సెంటర్లో సభా ప్రాంగణాన్ని కూడా ఆయన తనిఖీ చేశారు. సభ జరిగే ప్రాంతాన్ని పోలీసుల ఆధీనంలోకి తీసుకుని బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

ఎన్నికల సన్నద్ధతపై పరిశీలకులకు వివరించిన కలెక్టర్

పరిశీలకులకు వివరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత కోసం జిల్లా యంత్రాంగం చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఎన్నికల సాధారణ, వ్యయ పరిశీలకులకు వివరించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లాకు నియమితులైన సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, ఎస్.ఎ.రామన్, వ్యయ పరిశీలకులు షేరింగ్ జోర్డాన్ భూటియా, పి.కీర్తి నారాయణ్, మెష్రమ్ గౌరవ్ మధుకర్‌తో కలిసి జిల్లా ఎన్నికల ..6లో

పామాయిల్‌కు.. మద్దతు ధర కల్పిస్తాం

మాట్లాడుతున్న దెందులూరు అభ్యర్థి చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, దెందులూరు

పామాయిల్ పంటకు మద్దతు ధర కల్పించి, 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ కల్పిస్తామని, పనులు చేసే బాధ్యత తాను తీసుకుంటానని.. ఓట్లు వేసే బాధ్యత మీరు తీసుకోవాలని టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చంద్రబాబు ఏలూరు జిల్లా దెందులూరులో పర్యటించారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు స్థానిక ఎస్ఎంఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చంద్రబాబు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా దెందులూరులోని ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు ఐదు గంటలకు చేరుకున్నారు. తొలుత టిడిపి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ..6లో

- పోలవరం కుడి కాలువపై లిఫ్టులు పెట్టి దెందులూరుకు నీళ్లు
- కొల్లేరు కాంటూరు సమస్యను పరిష్కరిస్తాం
- చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తాం
- దెందులూరు ఎంఎల్ఎ పేకాట కంపెనీలు తెచ్చారని విమర్శ
- పోలవరం కుడికాలువ మట్టి దోచేశారని ఆరోపణలు
- దెందులూరు సభలో చంద్రబాబు

ప్రత్యేక సెస్ విధించి నిర్వాసితులను ఆదుకుంటాం

మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

- 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి
- కొయ్యలగూడెం సభలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి - టి.నరసాపురం, కొయ్యలగూడెం

ప్రత్యేక సెస్ విధించి పోలవరం నిర్వాసితులను ఆదుకుంటామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించారు. దానికి తన వంతుగా రూ.కోటి ఇస్తానని తెలిపారు. పోలవరం ..6లో

సమస్యల వలయం.. నూజివీడు నియోజకవర్గం.. మధ్యపేజీల్లో..

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

సొమ్మసిల్లిన పితాని 8లో..



అంగన్వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - భీమడోలు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న పిల్లలు ఒకటవ తరగతిలో నేరుగా చేరేందుకు సర్టిఫికెట్లు జారీ చేస్తారని గుండుగొలను నెంబర్ 23 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త బి.రాజామణి తెలిపారు. సదరు కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న పిల్లల్లో కొందరు నేరుగా ఒకటో తరగతిలో చేరేందుకు సర్టిఫికెట్ల జారీ ప్రధాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ కార్యక్రమం కింద నిర్వహించిన సదరు కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త మాట్లాడుతూ ప్రస్తుతం గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను స్వీకరించిన అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన పిల్లలు ఇకపై పాఠశాలల్లో ఒకటవ తరగతి విద్యార్థులుగా నమోదు కావచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రం జారీ చేసిన సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆధునీకరించిన అంగన్‌వాడీ కేంద్రంలో సేవలను

భీమడోలులో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేత

వినియోగించుకోవాలని కోరారు. ఆ తర్వాత విద్యార్థులుగా నమోదయ్యేందుకు వెళుతున్న అంగన్‌వాడీ కేంద్ర పిల్లలకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. జూన్ 12వ తేదీ తర్వాత వీరు ఒకటవ తరగతి విద్యార్థులుగా పరిగణింపబడతారని అంగన్‌వాడీ కార్యకర్త తెలిపారు.

మండవల్లి: చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేందుకు అంగన్వాడీలు అందించే పౌష్టికాహారం ఎంతగానో దోహదపడుతుందని సిడిపిఒ లావణ్య తెలిపారు. మండవల్లి నాలుగవ అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు చిన్నారులు ఎదుగుదలకు అవసరమయ్యే మంచి పౌష్టికాహారం అందుతుందని అన్నారు. అంతేకాకుండా మంచి అలవాట్లతో పాటు చక్కగా వినడం, పాటలు పాడడం, క్రమశిక్షణ కలిగి ఉండడం అంగన్వాడీలోనే ప్రారంభమవుతుందని ఆమె అన్నారు. ప్రీస్కూల్లో నిర్వహించే పూర్వప్రాథమిక విద్య వన్ టు లలో నిర్వహించే కార్యక్రమాల ద్వారా చిన్నారులకు అంగన్వాడీ కేంద్రం నుంచే ఆంగ్లం నేర్చుకోవడంతో పాటు తెలుగులో చక్కగా మాట్లాడటం అలవడుతుందని తెలిపారు. అనంతరం ప్రీ స్కూల్ సర్టిఫికెట్లను చిన్నారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగలక్ష్మి, కార్యకర్తలు జయలక్ష్మి, నాగలక్ష్మి, సరస్వతి, ఉమాదేవి, శ్రీదేవి, సుధారాణి, చిన్నారుల తల్లిదండ్రులు, ఆయా పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టామని భీమడోలు ఎంపిపి కనమాల రామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికలు 2024 నియమావళికి అనుగుణంగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు కనమాల రామయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని గతంలోనే తాగునీటి సమస్య పరిష్కారానికి సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. దీనిని సమర్థవంతంగా అమలు చేసి మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూసేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వాతావరణంలో పలు మార్పులు చోటుచేసుకున్నాయని ఆయన అన్నారు. ఈమేరకు ఎండలు, వడగాల్పులు(హార్ట్ వేవ్)ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఈమేరకు అవగాహన కల్పించాలని కోరారు. ఎంపిడిఒ టి.స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. దీనిలో భాగంగా మండలంలో నమోదైన 9,123 మంది లబ్ధిదారులకు వాటిని అందజేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా సుమారు 7 వేల మందికి పింఛన్లను ఆధార్‌తో అనుసంధానమైన వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయనున్నట్లు తెలిపారు. సదరు వివరాలను ఇప్పటికే గ్రామ సచివాలయాలకు అందజేసినట్లు చెప్పారు. మిగిలిన 2,123 మంది పింఛన్‌దారులు పెన్షన్‌లను తీసుకునేందుకు సచివాలయాలకు రావలసిన అవసరం లేదన్నారు. వారి ఇళ్ల వద్ద వారికి అందజేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. సాంకేతిక లోపాల వల్ల బ్యాంకు ఖాతాలకు నమోదు కాని అర్హులైన వారి పెన్షన్లను ఇదే తరహాలో అందజేసేందుకు చర్యలు చేపడతామన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఈనెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీ రంగా, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమా జూనియర్, పలువురు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం ముసునూరు మండలంలోని సూరేపల్లి, రమణక్కపేట గ్రామాల్లోని ఎన్నికల ప్రచారంలో పార్థసారథి, మాజీ మంత్రి కెఎస్.జవహర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సారథి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ టిడిపితోనే సాధ్యమవుతుందన్నారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే సమయానికి ప్రపంచవ్యాప్తంగా రాష్ట్రానికి ఒక గుర్తింపు ఉండేది. అభివృద్ధికి చిరునామాగా, సంక్షేమానికి నిర్వచనంలా, రాష్ట్రంలో పాలన సాగేది. కానీ గత ఐదేళ్ల పాలనంతా దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలు, ఆకృత్యాలు తప్ప ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, యువత జీవితాల కోసం చంద్రబాబు ఆలోచిస్తుంటే, జగన్ రెడ్డి

టిడిపి నూజివీడు అభ్యర్థి కొలుసు పార్థసారథి

ప్రచారం నిర్వహిస్తున్న పార్థసారథి

మాత్రం అందుకు భిన్నంగా ఉన్నారన్నారు. ప్రజల ఆస్తులు తాకట్టుపెట్టే దుర్మార్గ పాలనను అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ కార్యసిద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురు

కలిదిండి: మండలంలోని పడమటిపాలెంలో ప్రజా ఆశీర్వాద యాత్ర కొనసాగుతుండగా గ్రామ నాయకుల ఆధ్వర్యంలో జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులైన 100 మంది కార్యకర్తలు వైసిపిలోకి చేరారు. వారికి వైసిపి జెండా కప్పి ఆహ్వానించినట్లు కైకలూరు నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు తెలిపారు.

ప్రజల ఆదరణతో ఆనందం

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలు ఆనందానిస్తున్నాయని, మండలానికి చెందిన తాను లోకల్ అని తనకి ఈ ప్రాంతంలో అనేకమంది బంధువులు, స్నేహితులు ఉన్నారని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు తెలిపారు. మండలంలోని వీరిశెట్టిగూడెం, వెంకటాపురం, రావికంపాడు గ్రామాల్లో వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు పర్యటించారు. ముందుగా ఉదయం వీరిశెట్టిగూడెం గ్రామం చేరుకున్న ఆయనకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆయన ప్రచారం ప్రారంభించారు. సుమారు 300కు పైన బైకులు, కార్లతో గ్రామమంతా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఉన్న సిఎస్ఐ, ఆర్‌సిఎమ్ చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన ప్రజలకు చెప్పారు. పేదల సంక్షేమం కోసం నవ రత్నాలు ప్రవేశ పెట్టి వాటిని విజయవంతంగా అమలు

వైసిపి చింతలపూడి అభ్యర్థి కంభం విజయరాజు



అభివాదం చేస్తున్న విజయరాజు

చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. మళ్లీ జగన్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్‌పిటిసి కడిమి రమేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ మేడవరపు అశోక్ బాబు, మద్ది ఆంజనేయ స్వామి గుడి ఛైర్మన్ కేసరి సరిత భాస్కర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మిడత రమేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలో మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా ప్రజా కళాకారులు, సాహితీ ప్రియులు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు శ్రీశ్రీకి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అభ్యుదయ రచయితల సంఘం వ్యవస్థాపకులైన శ్రీశ్రీ కలంతో జాలువారిన మహాప్రస్థానం లాంటి ఎన్నో మహా గ్రంథాలు చదివి, దేశవ్యాప్తంగా ఉన్న యువతతో చైతన్యం రగిలించి తన రచన ద్వారా స్పందించిన అనేక మంది అభ్యుదయ రచయితల సంఘ సభ్యులుగా చేరి, అభ్యుదయ భావాలతో, సామాజిక సేవకు స్ఫూర్తినిచ్చిన శ్రీశ్రీకి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు, ప్రముఖ బుర్రకథ కళాకారులు సబ్బి కనకరావు, ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్ రాజు, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్‌ఆర్.కృష్ణ బాబు, బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ నివాళులర్పించారు. వీరితో పాటు విభూతి రాజేశ్వరి, సాయిన రాఘవమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సాయిన కనకరాజు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు తమ్మిశెట్టి సత్యనారాయణ, ట్రస్ట్ ఛైర్మన్ నిర్మల మధుసూదన్ రావు, వర్ధమాన సినీ నటుడు తిరుపతి రమేష్ బాబు ఉన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

కార్మికుల పండుగ రోజు మేడేలో కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్రం సాయికిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం భగత్ సింగ్ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం షేక్ సలీమ్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ కార్మికుల పోరాటానికి నిలువెత్తు సాక్ష్యం, కార్మికులు సాధించిన విజయానికి ప్రతీక నెత్తురు దారలు కారుతున్న, పిరంగులు మోగుతున్నా.. గుండెల్లో తూటాలు దూసుకువెళ్తున్నా ఎత్తిన జెండా దించకుండా పోరాడిన దినం మేడే అన్నారు. అందుకే కోట్లాది మంది కార్మిక లోకానికి పండుగ రోజైన మేడే వేడుకలు కుక్కునూరులో జరుగుతున్నాయన్నారు. ఆ మేడే వేడుకల్లో కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సాయికిరణ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల సహాయ కార్యదర్శి సురేష్, బిల్డింగ్ వర్కర్స్ పరిటాల సతీష్, హుస్సేన్, హరి, వలిపాషా పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వానికి మద్దతివ్వాలి : స్వాతి

ముదినేపల్లి: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్న జగనన్న సంక్షేమ ప్రభుత్వానికి మరో మారు ప్రజలు తమ మద్దతునివ్వాలని కైక లూరు ఎంఎల్ఎ డిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి అన్నారు. సోమవారం మండలంలోని పెయ్యేరు కాలనీ, ముదినేపల్లిలో వైసిపి శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య పాల్గొన్నారు.

ప్రచారంలో స్వాతి

జనసేనలోకి పలువురు

ముదినేపల్లి: మండలంలోని ఊటుకూరు గ్రామ సర్పంచి సుద్దా బత్తుల వరలక్ష్మి శ్రీనివాసరావు, పుల్లగడ్డ గౌరీ నాథ శర్మ, చింత బాలకృష్ణ, ఆలపాటి మోహన్ వైసిపిని వీడి జనసేన మండల అధ్యక్షుడు వీరంకి వెంకయ్య సమక్షంలో మంగళవారం జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, స్వతంత్రం ఇవ్వాలని, పవన్ కళ్యాణ్ ఆలోచనలతో, చంద్రబాబు పరిపాలనలో మళ్లీ రాష్ట్రాన్ని, అదేవిధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

PUBLICATION

IN THE COURT OF ADDITIONAL CIVIL JUDGE [SENIOR DIVISION], ELURU

E.P. NO.22/2023, O.S. NO.39/2008

Between:

Valasapalli Pulla Rao ...*Decree-Holder*

AND

Mandalapu Sri Krishna Leelavathi [Died] & others ...*JUDGEMENT-DEBTORS*

NOTICE

4. Mandalapu Veera Venkata Satyanarayana Vara Prasad, S/o Late Rama Chandra Rao, Cultivation, Near Government Junior College, Dharmajigudem Village and Post. Lingapalem Mandal. CJCJ.

6. Muttavarapu Meena Kumari Wife of Naresh, D/o Late Rama Chandra Rao, Cultivation, Near Government Junior College, Dharmajigudem Village and Post. Lingapalem Mandal. CJCJ.

Whereas the DHR filed E.P. for sale of schedule property. The Honourable court order notice under order 21 Rule 22 C.P.C. in the above petition to the JDRs 4 & 6.

Whereas as the notice addressed to the JDRs 4 & 6 in the above petition could not be served as last known address and the notice could not be served;

Whereas the Honorable court ordered notice to JDRs 4 & 6 by way substituted service by way of publication;

You, are hereby called upon to appear in person before this Honourable court Eluru **on 10-05-2024 at 10.30 A.M.** and state your objections if any. Lest the petition will be decided exparte.

(As per court orders)

DEVULAPALLI KRISHNA SASTRY

Eluru, Advocate

Dt.27-04-2024 Eluru

ముఖ్య వార్తలు

బుధవారం 1 మే 2024

ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - మండవల్లి

ఓటరు తమ ఓటు హక్కును ప్రశాంతమైన వాతావరణంలో వినియోగించుకునేలా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.ఎ.రామన్ అధికారులకు తెలిపారు. మండలంలోని కొవ్వాడ లంక, దయ్యంపాడు పోలింగ్ కేంద్రాలను మంగళ వారం ఆయన పరిశీలించారు.

మాట్లాడుతున్న సురేంద్రవర్మ

రఘురామకృష్ణంరాజును గెలిపించాలి

టిడిపి సీనియర్ నేత సురేంద్రవర్మ

ప్రజాశక్తి - ఉండి

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజును గెలిపించాలని టిడిపి సీనియర్ నాయకులు ముదుండి సురేంద్రవర్మ (ఎంఎస్) అన్నారు. మండలంలోని పాందువ్వ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే టిడిపి ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు సిటీ :ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఏలూరు పదో డివిజన్ జంగావారివీధి, తూతావారివీధి, నల్లమందు సందు ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజా సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడేటి చంటి ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'దళితద్రోహి జగన్'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దళితులకు గత టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన సిఎం జగన్ దళితద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని మాజీ మంత్రి కెఎస్.జవహర్, టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి, టిడిపి ఎస్సి సెల్ రాష్ట్ర నాయకులు దాసరి ఆంజనేయులు అన్నారు. ఏలూరు పవర్‌పేటలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. దళితుల పట్ల ముఖ్యమంత్రి జగన్, వైసిపి అవలంభిస్తోన్న తీరును ఎండగట్టారు.

చేసేదే చెబుతాం : వైసిపి

పాలకోడేరు :గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని, ప్రస్తుత ఎన్నికల్లో మేనిఫెస్టో ప్రకారం అన్ని కొనసాగిస్తామే తప్ప ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేయబోమని వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. గొరగనమూడి, శృంగవృక్షం గ్రామాల్లో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్‌తో కలిసి వారు మంగళవారం ప్రచారం చేశారు.

ప్రజా సేవే ముఖ్యం : అంజిబాబు

భీమవరం రూరల్ :పేదవారికి ఇళ్లు అందించింది తామేనని, తాను ఎంఎల్ఎగా ఉన్న సమయంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించామని మాజీ ఎంఎల్ఎ, జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు అన్నారు. స్థానిక భీమవరం మర్యాది వీధిలో ది బులియన్ ధర్మకాటా అసోసియేషన్ ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ తాను సింహాసనం కోసం కాదని, ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని అన్నారు.

కాంగ్రెస్ ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థుల రోడ్ షో

కుక్కునూరు :కుక్కునూరులో కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య, పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి దువ్వెల సృజన మంగళవారం రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో వేలేరు గ్రామం నుంచి 30 కార్లు, 50 బైకులు, ఐదు టాటా మ్యాజిక్‌లతో రోడ్ షో ప్రారంభమైంది. పలు గ్రామాల్లోని వివిధ కూడళ్లలో ప్రజలనుద్దేశించి వారు మాట్లా డారు. ఇండియా వేదిక అధికారం లోకి రావడం ద్వారానే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులు

ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

ఫార్వర్డ్ బ్లాక్ ఎంఎల్ఎ అభ్యర్థి శివరామరాజు

పాలకోడేరు :రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఫార్వర్డ్ బ్లాక్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేటుకూరు వెంకట శివరామరాజు (కలవపూడి శివ) అన్నారు. కొండేపూడి, రామచంద్రాపురం, వేంద్ర అగ్రహారం, వేంద్ర, మోగల్లు, కోరుకొల్లు, మైప గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండేపూడి గ్రామంలో జిఐడబ్ల్యు కెనాల్‌పై ఐరన్ వంతెన ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. తనకు ఓటు వేసి గెలిపించాలని, ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు సాయిరాజు సాంబరాజు, దుర్గ, భూపతి రాజు రాంబాబు, మహంకాళిరావు, శ్రీనివాస్, వేణు పాల్గొన్నారు.

పడవలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న శివరామరాజు

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

చెరకువాడ శ్రీరంగనాథరాజు

ప్రచారంలో శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనకే దక్కుతుందని వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట, చింతలతోట, కొరుపాలెం, పెద్దపేట, ఆచంట టౌన్ గ్రామాల్లో ఇంటింటా పాదయాత్ర నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చేసిన మేలును గుర్తించి వచ్చే ఎన్నికల్లో సిఎం జగన్‌కు మద్దతుగా నిలవాలన్నారు.

కారుమూరివి డ్రామాలు : ఆరిమిల్లి

తణుకు రూరల్ :తణుకు నియోజకవర్గంలో ఓటమి ఖాయమని తెలిసి ఎంఎల్ఎ కారుమూరి వెంకట నాగేశ్వరరావు కొత్త డ్రామాలు మొదలుపెట్టారని టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కారుమూరిని చంపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ప్రచారాలు చేస్తున్నారని, అంత అవసరం ఎవ్వరికీ లేదన్నారు. జగన్ గులకరాయితో హత్యా ప్రయత్నం అంటూ డ్రామా చేస్తే, ఇక్కడ కారుమూరి అదే బాటలో సెంటిమెంట్ కోసం మరో డ్రామా మొదలు పెట్టారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దొమ్మేటి వెంకటసుధాకర్, పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మంత్రిరావు బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆరిమిల్లి రాధాకృష్ణ

తాడేపల్లిగూడెంలో బాబ్జి ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలోని మసీదు రోడ్, పాతూరు, మహాలక్ష్మీనగర్‌లో కాంగ్రెస్ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి మార్నిడి శేఖర్ (బాబ్జి) మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా వేదికతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమన్నారు. చంద్రబాబు, జగన్, పవన్ కళ్యాణ్ వీరందరూ మోడీ నీడలోనే ఉన్నారన్నారు.

అభివృద్ధిని చూసి వైసిపికి ఓటు వేయండి

ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి వాసుబాబు

ప్రజాశక్తి - గణపవరం

వైసిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి తమకు ఓటు వేయాలని ఆ పార్టీ ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. మండలంలోని కోమట్ర, మొయ్యేరు, డికె.వల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుబాబు ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలిండియా బిసి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా రెడ్డి శ్రీనివాసు

పాలకోడేరు :పాలకోడేరు గ్రామానికి చెందిన రెడ్డి శ్రీనివాసును ఆలిండియా బిసి సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షులు గుడూరి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానికంగా మంగళవారం నిర్వహించిన అభినందన సభలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. రెడ్డి శ్రీనివాసు బిసి హక్కుల కోసం, రిజర్వేషన్ల కోసం నిరంతరం పోరాడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బిసి సంఘం జాతీయ కార్యదర్శి చింతాడ శ్రీను, గుల్లిపల్లి సత్యనారాయణ, ఆళ్ల నాగేశ్వరరావు, నాగిరెడ్డి చిన్న, గిరిజాల నాగబాబు, గిరిజాల వెంకన్న, గిరిజాల అశోక్, చందక సందీప్ పాల్గొన్నారు.

సిపిఎం, కాంగ్రెస్ నాయకుల ప్రచారం

నిడమర్రు : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య, ఎంఎల్ఎ అభ్యర్థి హరికుమార్‌రాజులను గెలిపించాలని మండలంలోని మందలపర్రు గ్రామంలో సిపిఎం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ప్రచారం చేశారు. వారు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. హామీలను అమలు చేయని బిజెపిని, దానితో పొత్తు టిడిపి, జనసేనలను, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైసిపి రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు కోరారు. ఈ కార్యక్రమంలో వెలగలేటి మోహన, మేడిశెట్టి పెంటారావు, రంగారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.చంద్రశేఖరరావు, వి.చిట్టిబాబు, నరేష్, శ్రీను పాల్గొన్నారు.

ప్రచారంలో నేతలు

తానేటి వనిత ప్రచారం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల మండలం ఐఎస్.జగన్నాధపురంలో మంత్రి తానేటి వనిత మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి మాఫియా చేస్తున్న వైసిపి

టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలో వైసిపి నాయకులు మట్టి మాఫియాకు పాల్పడుతున్నారని టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓడిపోతామనే భయంలో వైసిపివారు ఎక్కడికక్కడ సహజ వనరులైన సంపద దోచుకోవడంలో బిజీగా ఉన్నారని. రాత్రి సమయంలో టిప్పర్లతో వైసిపి నాయకులు మట్టి మాఫియా పాల్పడుతున్నారన్నారు. అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న రోషన్‌కుమార్

టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి - కామవరపుకోట

తాడిచర్ల సర్పంచి పసుమర్తి సారధిబాబు ఆధ్వర్యంలో గ్రామంలో టిడిపి నేతలు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉపాధి హామీ పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

'టిడిపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - తణుకు రూరల్

టిడిపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. మండలంలోని దువ్వ గ్రామంలో ఆమె మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలో అరాచకం, అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి : రఘురామ

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలో గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు, ప్రాతళ్లమెరక, పల్లిపాలెం గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ ప్రచారంలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు పాల్గొన్నారు.

భట్లమగుటూరులో పితాని కోడలు ప్రచారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని భట్ల మగుటూరులో టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ కోడలు నాగ సాహితీ మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షురాలు గోసాల సుజాత, కటికల రత్నాబాయి, గోసాల ఉషారాణి, జక్కంశెట్టి సత్యవతి, శిరాముల అచ్యుతాంబ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే ఏకైక లక్ష్యం

రాష్ట్ర ప్రత్యేక పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజాస్వామ్య పరిరక్షణ మన ముందు ఉన్న ఏకైక లక్ష్యమని, ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణ ఎంతో కీలకమని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర పోలీసు పరిశీలకులు దీపక్ మిశ్రా జిల్లా పర్యటన సందర్భంగా ఏలూరు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు డిజిపి శంఖబ్రత బాగ్చి, జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకులు టి.శ్రీధర్, ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్ కుమార్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్ మిశ్రా మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు కులం, మతం, ప్రాంతం, తదితర బేధం లేకుండా ప్రవర్తించాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్లు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు వ్యవస్థ విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారితో సమన్వయం చేసుకోవాలని దీపక్ మిశ్రా సూచించారు. ప్రతి ఐదు సంవత్సరాలకోసారి ఓటు హక్కు ద్వారా పాలకులను ఎన్నుకోవడం జరుగుతోందని తెలిపారు. ఆ క్రమంలో పోలీసులు, భద్రతా సిబ్బంది నిర్వహించే ఉద్యోగ నిర్వహణ సామర్థ్యం కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి సమస్యా తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల స్లిప్పుల పంపిణీ కోసం, హోమ్ ఓటింగ్‌పై తీసుకున్న చర్యల గురించి ఆయన ప్రస్తావించారు. ఇవిఎంల తరలింపు సమయంలో సంబంధిత వాహనాలకు ముందు బ్యాక్ కెమెరాతో వీడియో చిత్రీకరణ చేయాలని, మార్గమధ్యంలో ఎక్కడా వాహనాన్ని నిలుపుదల చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ ప్రక్రియకు చెందిన సమాచారం అందజేసి, తగిన రశీదు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో రికార్డింగ్, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి 24/7 పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 13 మంది, 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 86 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ రూ.14.09 కోట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు 612 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. ఒకే కేంద్రంలో రెండు కంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్లు ఉన్నచోట వీడియో చిత్రీకరణకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా ఎస్పి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 1082 ప్రాంతాల్లో 1743 పోలింగ్ కేంద్రాలు ఉండగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 415 ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో ఇంటర్ స్టేట్ 8 చెక్ పోస్టులు ఏర్పాటు చేయగా, మరో 22 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. 245 వెపన్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో 29 బ్యాంకు సెక్యూరిటీ కోసం ఉన్నాయన్నారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను హెల్ప్ లైన్‌తో ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అవాస్తవ వార్తా కథనాలను, తదితరాలను నియంత్రించేందుకు ప్రత్యేక ఫోన్ నంబరు ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, అదనపు ఎస్పి స్వరూప రాణి, డిఆర్ఒ డి.పుష్పమణి, సబ్ జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

మేడే శుభాకాంక్షలతో...
కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి... పోరాడి సాధించిన రోజు... మేడే శుభాకాంక్షలు
కొయ్యలగూడెం మండల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్
(సిఐటియు అనుబంధ సంస్థ)
అధ్యక్షులు: మట్టా శివ రత్నకుమారి
సెక్రటరీ: జంపన నాగమణి
ట్రెజరర్: తమ్మినీడి పద్మజ

మేడే శుభాకాంక్షలతో...
కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి... పోరాడి సాధించిన రోజు... మేడే శుభాకాంక్షలు
ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్
UTF
ద్వారకాతిరుమల మండల శాఖ
బి.జయరాజు - అధ్యక్షులు
కె.శ్రీనివాసరావు - ప్రధాన కార్యదర్శి
పి.వరప్రసాద్ - గౌరవ అధ్యక్షులు
కె.చినబాబు - ట్రెజరర్
పి.రాంబాబు - సహ అధ్యక్షులు
శ్రీమతి తులసీ వరలక్ష్మి - మహిళా సహ అధ్యక్షురాలు
జిల్లా కార్యదర్శులు: జి.దేవానందరావు, ఎన్.రాంబాబు మరియు మండల కార్యదర్శులు, సభ్యులు

మేడే శుభాకాంక్షలతో...
శ్రమను గౌరవిద్దాం...
శ్రమను గుర్తిద్దాం... శ్రమ చేద్దాం...
కె.వెంకటేష్, ఏలూరు

మేడే శుభాకాంక్షలతో...
శ్రమ-శిక్షణ... ఉత్తమ విద్య...
శ్రీ త్రివేణి
నర్సరీ టు ఇంటర్మీడియట్ ఇంగ్లీషుమీడియం
ప్రసాద్ విద్యాసంస్థలు
జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా
ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, నాయకులకు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులకు, గ్రామీణ ప్రజానీకానికి మేడే శుభాకాంక్షలు...
H.B.R.ప్రసాద్, చైర్మన్
Cell: 81216 20223, 7399399111

మేడే శుభాకాంక్షలతో...
కార్మికులు, కర్షకులకు మేడే శుభాకాంక్షలు...
శ్రీ వెంకటేశ్వర ఏజన్సీస్
ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్, పెనుగొండ, ప.గో.జిల్లా

మేడే శుభాకాంక్షలు...
కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి...
శ్రమ జీవుల ఐక్యత మేడే...
ప్రపంచ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి...
సోదర కార్మికులకు మేడే శుభాకాంక్షలు
దోకల సత్యనారాయణ - ప్రగతి గన్నీస్ స్టోర్స్, ఆకివీడు, ప.గో.జిల్లా
దోకల లక్ష్మి - మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు, ఆకివీడు, ప.గో.జిల్లా

సార్వత్రిక సంగ్రామం

సమస్యల వలయం.. నూజివీడు నియోజకవర్గం..

పాలకుల హామీలు తుంగలోకి

పట్టని అధికారులు.. ప్రజల అవస్థలు

నూజివీడు నియోజకవర్గంలో సమస్యలు తాండవిస్తున్నాయి. సాగు నీటి సమస్య ఎక్కువగా ఉంది. రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని, పాలకులు ఎన్నికల సమయంలో హామీలివ్వడం తప్ప తరువాత వాటిని పరిష్కరించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు తాగునీరు, ఇళ్ల స్థలాల సమస్య ఎక్కువగా ఉందని వాపోతున్నారు. అయితే నూజీవీడు మంచి పేరుంది..

ముసునూరులో అధ్వానంగా ఉన్న రోడ్డు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ముసునూరు

నియోజకవర్గంలోని నాలుగు మండలాలైన నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయిలో 84 గ్రామ పంచాయతీలు, 6 శివారు గ్రామ పంచాయతీలతో 90 గ్రామాలు ఉన్నాయి. సుమారు మూడు లక్షలకు పైగా జనాభా రెండు లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. 1983లో ఈ నియోజకవర్గం ఏర్పడింది. అప్పుడు రోడ్లు ఎలా ఉన్నాయో నేటికీ అలాగే దర్శనమిస్తున్నాయి. నూజివీడులోని చిన్నగాంధీ బొమ్మ కూడలి నుంచి పెద్ద గాంధీ బొమ్మ కూడలి వరకూ, అలాగే ఆర్‌టిసి బస్టాండ్ వరకూ పూర్వ ఎంఆర్.అప్పారావు జమిందారీ పరిపాలనలో రోడ్లు ఎలా ఉన్నాయో ఇప్పుడూ అదే పరిస్థితి నెలకొంది. గత కొన్ని సంవత్సరాల నుంచి పైన పేర్కొన్న నాలుగు సెంటర్లలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే సమస్యను పరిష్కరించడంలో నేతలు విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు పేదలకు నేటికీ ఇవ్వని పరిస్థితి. దీంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. నూజివీడు రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఇళ్ల స్థలాల సమస్య తీవ్రంగా ఉంది. పలు గ్రామాల్లో స్థలాలు ఇవ్వకపోవడం, కొన్ని చోట్ల ఇచ్చినా ఊరికి దూరంగా ఇవ్వడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

ముసునూరు మండలంలోని 16 గ్రామాల్లో ఉన్నాయి. ఇది వ్యవసాయ ఆధారిత మండలం. మండలంలోని వ్యవసాయ భూములు సారవంతమైనవి. దీంతో రైతులు సాగుపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అయితే ఇక్కడ రైతులు బోర్లపై ఆధారపడి పంటలు పండిస్తున్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ బోర్లు, బావులు కలిగిన మండలమని పేరు. అలాగే ఎక్కువ వ్యవసాయ విద్యుత్ కన్‌క్షన్లు కలిగిన మండలం ముసునూరే. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తియ్యి మండలంలోని అన్ని గ్రామాలకు గోదావరి నీరు వస్తే పుష్కలంగా పంటలు పండి రైతులు, వ్యవసాయ కార్మికులకు జీవనాధారం అవుతుందని అంతా ఎదురుచూస్తున్నారు. ముసునూరు, పలు గ్రామాల్లో ఇళ్ల స్థలాల సమస్య అలాగే వుండిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని ఏరియాల్లో ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తుంటే కొన్ని చోట్ల స్థలాలు కూడా ఇవ్వకపోవడం గమనార్హం. అలాగే నూజివీడు - ఏలూరు వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బి రోడ్డు గోతులమయంగా మారింది.

ఆగిరిపల్లి మండలంలో రోడ్లు దారుణంగా తయారయ్యాయి. అదే విధంగా మామిడి పంటకు ప్రసిద్ధి ఆగిరిపల్లి. అయితే మామిడి వ్యాపార కేంద్రం నున్నలో పెట్టడం కంటే ఆగిరిపల్లిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఎక్కువ గ్రామాలున్న ఆగిరిపల్లి మండలంలో ఫైరింజన్ లేదు. అగ్ని ప్రమాదం జరిగితే నూజివీడు నుండి లేదా ఇటు గన్నవరం నుండి ఫైరింజన్ వచ్చే సమయానికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఆగిరిపల్లిలో మెట్ట కోనేరులో కృష్ణా జలాలు రాప్పించి తాగునీరు సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన నాయకులు నేటికీ ఆ సమస్యను పరిష్కరించలేదు.



నూజివీడు రసాలు

చాట్రాయి మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇది వ్యవసాయ ఆధారిత మండలం. తమ్మిలేరు పరిసర ప్రాంత సరిహద్దు గ్రామాలతో వ్యవసాయ పంటలకు పెట్టింది పేరు. ఇక్కడ వరి, మొక్కజొన్న పంటలు ఎక్కువగా పండిస్తారు. మండలంలో ఇళ్ల స్థలాల సమస్య తీవ్రంగా ఉంది. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏది ఏమైనాప్పటికీ నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు పూర్తి వ్యవసాయ ఆధారిత మండలాలు. అయితే చింతలపూడి ఎత్తి పోతల పథకం పూర్తియినట్లేయితే సస్యశ్యామలంగా ఉంటాయని చెప్పొచ్చు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్

ఉంగుటూరు : స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ కోరారు. ఎన్నికల ప్రక్రియ, నియమ నిబంధనలపై అభ్యర్థులకు, ప్రతినిధులకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్ పాఠక్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ఉల్లంఘనలపై సి విజిల్ లేదా ఇతర మార్గాల ద్వారా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఏమైనా ఫిర్యాదులుంటే ఆర్ఒలకు గానీ నేరుగా తమకు గానీ (9154690377) ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఇవిఎంలపై ఎటువంటి అపోహలూ వద్దని, వాటిని ట్యాంపరింగ్ చేయడం సాధ్యం కాదని ఇప్పటికే నిరూపణ అయ్యిందని, న్యాయస్థానం కూడా నిర్ధారించిందని తెలిపారు. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు రూ.40 లక్షలు, పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థులు రూ.95 లక్షల వరకూ ఖర్చు చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

ఏలూరు: పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రజలు ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే ఎన్నికల పరిశీలకుల దృష్టికి ఫోన్ ద్వారా గానీ అర్జీల రూపంలో గానీ తెలియజేయొచ్చని ఎన్నికల సాధారణ పరిశీలకులు, పోలీసు పరిశీలకులు మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. వీరు బసచేసే ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ఆయా నియోజ కవర్గాలకు సంబంధించిన పరిశీలకులకు ఫిర్యాదులు అందజేయాలని తెలిపారు. పోలీసు పరిశీలకులు ఏలూరు జెడ్‌పి గెస్ట్‌హౌస్‌లో ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరధిలో 63 - ఉంగుటూరు, 64-దెందులూరు, 65-ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా కృష్ణకాంత్ పాఠక్ ఐఎఎస్ వ్యవహరిస్తారని, ఆయన నంబరు 9154690377 అని తెలిపారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 67-పోలవరం, 68-చింతలపూడి, 70-నూజివీడు, 73-కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా ఎస్ఎ.రామన్ ఐఎఎస్ వ్యవహరిస్తారని తెలిపారు. ఆయన ఫోన్ నంబరు 9491041437 అని తెలిపారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి పోలీసు పరిశీలకులుగా టి.శ్రీధర్ ఐపిఎస్ వ్యవహరిస్తారని, ఆయన నంబరు 9154690388 అని తెలిపారు. వీరు ఏలూరు జెడ్‌పి గెస్ట్ హౌస్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ అందుబాటులో ఉంటారని తెలిపారు.

మేడే శుభాకాంక్షలు...
ఆడవాళ్ళ మరియు చిన్నపిల్లల ఆరోగ్యానికి సంపూర్ణ చికిత్సాలయం
సురక్ష హాస్పటల్స్
ప్రసూతి స్త్రీల వైద్య సేవలు - గైనకాలజీ
చిన్నపిల్లల వైద్య విభాగము - పిడియాట్రిక్స్
గర్భిణీ స్త్రీలకు ప్రతినెల మొదటి బుధవారం స్కానింగ్ మరియు ఒ.పి. ఉచితంగా చూడబడును
ఆరోగ్యశ్రీ
24 గం|| ఫార్మసీ, 24 గం|| ల్యాబ్, స్కానింగ్, 24 గం|| వైద్యసేవలు
I.C.I., N.I.C.U., E.C.G.
సురక్ష హాస్పటల్
ఎమర్జెన్సీ & మల్టీకేర్
Emergency : 8500003454
అపోలో స్కూల్ దగ్గర, కన్నాపురం రోడ్, కొయ్యలగూడెం-534312

మేడే శుభాకాంక్షలతో...
కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి... పోరాడి సాధించిన రోజు... మేడే శుభాకాంక్షలు
1 MAY
వైష్ణవి ఆగ్రో ఇండస్ట్రీస్
అజ్జమూరు, ఆకివీడు మండలం, ప.గో.జిల్లా
మే.పా|| మోటుపల్లి సుబ్బారావు, దాసరి కృష్ణ

మేడే శుభాకాంక్షలతో...
కార్మికులంతా ఒక్కటై తమ శక్తిమేంటో ప్రపంచానికి చాటి చెప్పిన రోజు "మేడే".
ఈ మేడే స్ఫూర్తిగా సాధించుకున్న చట్టాల అమలుకు, హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ఒక్కటై నినదిద్దాం... కార్మికులారా ఏకంకండి
సమగ్ర శిశు సేవా అభివృద్ధి పథకం
(ICDS), జంగారెడ్డిగూడెం ప్రాజెక్ట్
ద్వారకాతిరుమల మండలం
ఏలూరు జిల్లా
అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్
అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు హెల్పర్స్

మేడే శుభాకాంక్షలతో...
కార్మికులంతా ఒక్కటై తమ శక్తిమేంటో ప్రపంచానికి చాటి చెప్పిన రోజు "మేడే".
ఈ మేడే స్ఫూర్తిగా సాధించుకున్న చట్టాల అమలుకు, హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ఒక్కటై నినదిద్దాం... కార్మికులారా ఏకంకండి
శ్రీ వెంకటలక్ష్మి శివసాయి రైస్‌మిల్లు ముఠా వర్కర్స్ - జట్టు మేస్త్రీ: బొర్రా శ్రీనివాసరావు, కె.అప్పలకొండ - అండ్ జట్టు కార్మికులు
శ్రీ వెంకట రామకృష్ణ రైస్‌మిల్లు ముఠా వర్కర్స్ - జట్టు మేస్త్రీ: తమ్మిశెట్టి కృష్ణ, చీకటి త్రినాథ్ - అండ్ జట్టు కార్మికులు
శ్రీ రామకృష్ణ మోడరన్ రైస్‌మిల్లు ముఠా వర్కర్స్ - జట్టు మేస్త్రీ: బొర్రా సత్యనారాయణ, బడుగు సాంబశివరావు - అండ్ జట్టు కార్మికులు
పద్మశ్రీ రైస్‌మిల్లు ముఠా వర్కర్స్ - జట్టు మేస్త్రీ: కొట్టు నారాయణ, నిమ్మల శ్రీనివాసరావు - అండ్ జట్టు కార్మికులు
శ్రీ జయలక్ష్మి రైస్‌మిల్లు ముఠా వర్కర్స్ - జట్టు మేస్త్రీ: యర్రా శ్రీనివాసరావు, కొట్టు వినాయక - అండ్ జట్టు కార్మికులు

మేడే శుభాకాంక్షలతో...
కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి... పోరాడి సాధించిన రోజు... మేడే శుభాకాంక్షలు
జంగారెడ్డిగూడెం మండల పంచాయతీ కార్యదర్శులు, ఏలూరు జిల్లా
కె.విజయప్రసాద్ - ఎం.పి.డి.ఒ
ఎం.నాగిరెడ్డి - ఇ.ఒ.పి.ఆర్.డి.,
సిహెచ్.శ్రీదేవి - ఎ.పి.ఒ.,
సిహెచ్.గోపాలకృష్ణ - ఎ.ఒ.,
ఝాన్సీ - ఎ.పి.ఎం.,
గ్లోరి - సీనియర్ అసిస్టెంట్
హుస్సేన్ - జూనియర్ అసిస్టెంట్
కె.పద్మశ్రీ - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-3, ఎ.పోలవరం
సత్తిబాబు - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-5, చక్రదేవరపల్లి
వై.చెంచమ్మ - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-3, దేవులపల్లి
పగడం నాగేశ్వరరావు - ఇన్‌ఛార్జ్, గురవాయిగూడెం
జి.సుబ్బలక్ష్మి - ఇన్‌ఛార్జ్, కేతవరం
పగడం నాగేశ్వరరావు - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-1, లక్కవరం-1
కుమార్‌బాబు - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-5, లక్కవరం-2
వి.వరలక్ష్మి - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-3, మైసన్నగూడెం
జి.సుబ్బలక్ష్మి - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-3, పంగిడిగూడెం
గుంజ బ్రహ్మయ్య - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-3, పట్టెన్నగూడెం
జి.బుజ్జిబాబు - ఇన్‌ఛార్జ్, పేరంపేట
ఎస్‌కె.అర్షద్ - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-5, పుట్లగట్లగూడెం
ఈడుపుగంటి రత్న శ్రీనివాస్ - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-3, శ్రీనివాసపురం
ఎం.సునీల్‌కుమార్ - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-1, తాడువాయి-1
ముత్తయ్య - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-5, తాడువాయి-2
నాగలక్ష్మి - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-5, టెక్కినవారిగూడెం
జి.సుబ్బలక్ష్మి - ఇన్‌ఛార్జ్, తిరుమలాపురం
జి.బుజ్జిబాబు - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-3, వేగవరం-1
రమేష్ - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-3, వేగవరం-2
వి.ఎస్.కె.ప్రసాద్ - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-5, నాగులగూడెం
సందీప్ - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-5, అమ్మపాలెం
గణేష్ - పంచాయతి కార్యదర్శి గ్రేడ్-5, అక్కంపేట

లింగ నిర్ధారణా పరీక్షలు చేస్తే చర్యలు

ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్

ప్రజాశక్తి - నరసాపురం

లింగ నిర్ధారణా పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పిసిపిఎన్ డిటి యాక్ట్ కమిటీ సమావేశం ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ అధ్యక్షతన సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ చేయు సామర్థ్యం ఉన్న ఏ యంత్ర పరికరాలను సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. సంబంధిత గర్భిణీ, ఆమె బంధువులకు పుట్టబోయే బిడ్డ లింగ వివరాలను వెల్లడించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు మొదటిసారి ఉల్లంఘించిన వైద్యులు,

మాట్లాడుతున్న అంబరీష్

నిపుణులు, ఇతరులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించబడుతుందని అన్నారు. తదువరి అదేవిధమైన ఉల్లంఘనకు పాల్పడే వారికి రూ.50 వేల జరిమానాతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు చెప్పమని అడిగినా, అడగమని ప్రోత్సహించినా, చెప్పిన వారికి మొదటి తప్పుకు చట్టప్రకారం 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధించడం జరుగుతుందని, మరలా ఇదే నేరం చేసినట్లైతే 5 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించబడుతుందని అన్నారు. వైద్యులపై ఈ నేరం చేసినట్లు రుజువైతే వారి వైద్య పట్టా భారత వైద్య మండలిలో మొదటి తప్పుకు 5 సం.లు నిలిపివేయబడుతుందని, అదే తప్పు మరలా చేసినట్లయితే పూర్తిగా సర్టిఫికెట్ రద్దు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డాక్టర్ వి.ప్రసాద్, లీగల్ ఎక్స్పర్ట్ చల్ల దానయ్య నాయుడు, ఎస్.శిరీష, గైనకాలజిస్ట్ జై.గణేష్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - భీమడోలు

భవన నిర్మాణ కార్మికులు ఒకరు నిర్మాణపు పనుల్లో పాల్గొని ప్రమాదవశాత్తూ భవనం పైనుంచి జారి కిందపడి చనిపోయిన సంఘటన భీమడోలులో మంగళవారం చోటుచేసుకుంది. భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు అంబరుపేట గ్రామానికి చెందిన నిట్టా వేణు(33) భవన నిర్మాణ కార్మికుడు సెంట్రింగ్ పనులు చేస్తుంటారు. మంగళవారం భీమడోలులో నిర్మాణం పనులు జరుగుతున్న ఒక భవనానికి సెంట్రింగ్ అమర్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తూ భవనం పైనుంచి కిందకు పడి, తలకు గాయమై ఘటనా స్థలంలోనే మృతిచెందారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య వాణి ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటి చెరువులకు కాలువల ద్వారా నీరందించాలి

కలిదిండి: రానున్న వేసవి దృష్ట్యా మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపేందుకు కాలువల ద్వారా మంచినీటిని విడుదల చేయాలని కోరుకొల్లు సర్పంచి బట్టు లీలా కనకదుర్గ అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని, తూతూ మంత్రంగా మూడు రోజులు కాలువల ద్వారా నీరు విడుదల చేసి అధికారులు మమా అనిపించారని ఆమె ఆరోపించారు. కోరుకొల్లు పంచాయతీ పరిధిలో ఏ ఒక్క చెరువు సగం కూడా నిండలేదన్నారు. కోరుకొల్లు శివారు 6 కిలోమీటర్ల దూరాన ఉన్న చైతన్యపురం గ్రామ మంచినీటి చెరువుకు తాగునీరందించేందుకు సంబంధిత అధికారులు సహకరించలేదని వాపోయారు. ఆ ప్రాంతం పూర్తిగా ఉప్పునీటి మయమన్నారు. మంచినీటి చెరువుకు అనుసంధానమైన కాలువను ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం చేసినా, పంచాయతీ ద్వారా మిషన్‌తో కాలువ బాగుచేయించామన్నారు. అయినా నీరు విడుదల చేయకుండా కాలయాపన చేసి, కాలువలు కట్టేసారన్నారు. గ్రామస్తులు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందితో మూడు రోజులు కాలువ వెంబడి కాపలా కాచినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తాగు నీరు విడుదల చేయకుంటే వేసవిలో గ్రామస్తులు గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్

ఏలూరు అర్బన్: మంచి పౌష్టికాహారంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని, కావున పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మంగళవారం పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయ వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలో వృద్ధులకు అందిస్తున్న వసతులపైన వివరాలడిగి తెలుసుకున్నారు. వసతి గృహాన్ని పరిశీలించి మరింత పరిశుభ్రతను పాటించాలని యాజమాన్యానికి సూచించారు. వసతి గృహంలోని సభ్యులకు ఏమైనా న్యాయ సహాయం అవసరం అయితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులు హాయిగా గడపాలి

జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విశ్రాంత ఉద్యోగులు తమ ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో హాయిగా గడపాలని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఎస్ఐ మల్లికార్జునరావు ఉద్యోగ విరమణ, ఆత్మీయ వీడుకోలు కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఎస్‌పి పాల్గొని పోలీస్ శాఖకు ఆయన ఎన్నో సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి స్వరూప రాణి, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, వెల్ఫేర్ ఆర్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారానికి వెళ్లొస్తున్న మహిళలపై దాడి

ఏలూరు టౌన్: దెందులూరులో కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొన్న మహిళలపై కొందరు వైసిపి నాయకులు దౌర్జన్యం చేయడం తీవ్ర ఆరోపణలకు కారణమైంది. జుట్టు పట్టుకుని లాగి, గాజు ముక్కలతో దాడి చేశారని, గాయలపాలై ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేరినట్టు సదరు మహిళలు ఆరోపిస్తున్నారు. వివరాలు పరిశీలిస్తే.. సోమవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి ఆలపాటి నరసింహారావుతో కలసి, పెదవేగి మండలం గంగన్న గూడెంలో ప్రచారం నిర్వహించుకుని వస్తున్న కాంగ్రెస్ మహిళలపై వైసిపి నాయకుల మూకుమ్మడి దాడికి పాల్పడినట్టు మహిళలు చెబుతున్నారు. మా జెండాలు పీకేసి, వాహనంలో ఉన్న తమపై దాడికి దిగారని వివరించారు. జుట్టు పట్టుకుని లాగి, కిందపడేసి, మా వాహనం అద్దాలు ధ్వంసం చేసి ఆ గాజు ముక్కలతో మహిళలని కూడా చూడకుండా దాడి చేశారని తెలిపారు. తాము ఏం అన్యాయం చేశామని ప్రశ్నించారు. అబ్బయ్య చౌదరిని గెలిపించటానికి గతంలో ఎంతో కృషి చేశామని, ఈరోజు అందుకు ప్రతిఫలం అనుభవిస్తున్నామని చెప్పారు. తమపై దాడి జరుగుతుంటే పోలీసులు కనీసం ఆపే ప్రయత్నం చేయలేదని, ఎంఎల్ఎకి మద్దతుగా పోలీసులు నిలిచారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో తమకు రక్షణ కావాలంటూ కన్నీటితో పెదవేగి మండలం మొండూరు గ్రామానికి చెందిన దాసరి లూర్థు కుమారి, గెడ్డం స్వరూప రాణీ, కొర్రపాటి దుర్గ అనే బాధిత మహిళలు వాపోయారు. మూడు రోజుల క్రితం చింతమనేని ప్రభాకర్‌తో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని, పలువురు గ్రామస్థులపై వైసిపి నాయకులు దాడి చేయటం ప్రజలు మరువక ముందే ఈరోజు కాంగ్రెస్ మహిళలపై దాడి చేయటం తీవ్ర కలకలం రేపుతోంది.

నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై ఫిర్యాదు

ఉంగుటూరు: కార్లు, లారీలు, తదితర వాహనాలకు నిబంధనలను అతిక్రమించి ఎర్ర రంగులతో నంబరు ప్లేట్లు బిగిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని కోరుతూ ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన సామాజిక కార్యకర్త మెండ్యాల నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఏలూరు ఉప రవాణా కమీషనర్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేసినట్లు నాగేశ్వరరావు ఇక్కడ విలేకర్లకు వెల్లడించారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

(మొదటి పేజీ నుంచి)

అధికారి ప్రసన్న వెంకటేష్, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి పలు విభాగాలకు సంబంధించి నోడల్ అధికారులు, ఏడు నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లూ సజావుగా జరుగుతున్నాయన్నారు. ఎన్నికల నిర్వహణకు 2108 పిఒలు, 2129 మంది ఎపిఒలు, 8243 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించారు. కౌంటింగ్ ప్రక్రియకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. వేసవి నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యంతోపాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, విభిన్నప్రతిభావంతులు లైన్లో వేచి ఉండకుండా నేరుగా ఓటు వేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వ్యయ పరిశీలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల పరిశీలకులు సూచించారు. చెక్ పోస్టుల వద్ద మరింత నిఘా పెంచాలన్నారు. ఎన్నికలకు కేటాయించిన సిబ్బంది పనితీరు ఉత్సాహకరంగా, ఇదే సన్నద్ధతను ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కొనసాగించి ఎన్నికల నిర్వహణ ప్రక్రియను విజయవంతం చేయాలని పరిశీలకులు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ టి.శ్రీపూజ, డిఆర్ఒ డి.పుష్పమణి, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పామాయిల్‌కు మద్దతు ధర కల్పిస్తాం

(మొదటి పేజీ నుంచి)

యువతకు ఉద్యోగాలిచ్చే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు. రోడ్లు, తాగునీరు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎనిమిదికిపైగా పరిశ్రమలను తీసుకొస్తానని, ఇప్పటికే తనకున్న పరిచయాలతో విదేశాలకు చెందిన గ్రీన్ కంపెనీతో మాట్లాడి ఉంగుటూరులో పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. పరిశ్రమ వస్తే 2,800 ఉద్యోగాలు వస్తాయన్నారు. రాబోయే మూడు నెలల్లో ఇది చేస్తామన్నారు. మొదటి శంకుస్థాపన ఇక్కడే జరుగుతుందన్నారు. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఎల్ఎ అభ్యర్థి చింతమనేని మాట్లాడుతూ గతంలో పోలవరం కుడికాలువ మీద రూ.వంద కోట్లతో రెండు లిఫ్టులు ఇచ్చారని, వాటిని పూర్తి చేసి దెందులూరుకు నీళ్లు ఇవ్వాలని, అధికారంలోకొచ్చాక ఈ సమస్యను పరిష్కరించాలని చంద్రబాబును కోరారు. మూడోసారి తనను జనం అసెంబ్లీకి పంపిస్తారని తెలిపారు. అనేక కేసులు పెట్టడంతో అంతా తిరుగుతున్న పరిస్థితి ఉందన్నారు. 2014 ఫలితాలు జిల్లాలో పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో సమర్థవంత నాయకత్వం కావాలన్నారు. పులివెందులా, పిఠాపురమో తేల్చుకోవాలన్నారు. ఇది ప్రజా విజయమన్నారు.

కొల్లేరు సమస్యను పరిష్కరిస్తాం.. పోలవరం పూర్తి చేస్తాం

అధికారంలోకొచ్చాక కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, 2019లో అధికారంలోకి వచ్చి ఉంటే ఇప్పటికే జరిగిపోయేదని చంద్రబాబు అన్నారు. పోలవరం కుడికాలువకు సంబంధించి రైతులను ఒప్పించి పరుగులు పెట్టించామన్నారు. 28 సార్లు పోలవరం ప్రాజెక్టు వద్దకు వెళ్లానని, 80 సార్లు రివ్యూ చేశానని, 72 శాతం పూర్తి చేశానని తెలిపారు. ఈసారి పోలవరం పూర్తి చేస్తామన్నారు. పోలవరం కుడికాలువపై ఒకటి, రెండు లిఫ్టులు పెట్టి దెందులూరుకు నీరిస్తామన్నారు. దెందులూరును దందాల ఊరిగా ఎంఎల్ఎ మార్చేశారన్నారు. లండన్ బోయ్ మంచోడు అనుకుంటే అభివృద్ధి చేశాడా.. ఐటి కంపెనీలు తెచ్చాడా అని ప్రశ్నించారు. పేకాట కంపెనీలు తెచ్చి జూదాలు మొదలు పెట్టాడన్నారు. లండన్ వెళ్తే బుద్ధి మారిందనుకుంటే గడ్డి తిందన్నారు. గుడి, బడి అని లేకుండా మద్యం అమ్ముతున్నారన్నారు. పోలవరం కుడికాలువ మట్టి దోచేశారన్నారు. మట్టి తవ్వకాలతో భవిష్యత్తులో వరద వస్తే ఊళ్లపైకి వస్తుందన్నారు. ఇలాంటి దుర్మార్గులను జైల్లో పెట్టినా తప్పు లేదన్నారు. జగన్నాథపురం ఎత్తిపోతలకు బటన్ నొక్కినా పని కాలేదన్నారు. ఇసుక మాత్రం మాయం చేశారన్నారు. గోనె సంచులు ఇవ్వలేని మంత్రి కొడుకుని ఇక్కడి పంపించారన్నారు. సామాజిక న్యాయంలో భాగంగా ఎంపీ అభ్యర్థిగా మహేష్‌ను తీసుకొచ్చామన్నారు. చింతమనేని, మహేష్‌ను గెలిపించాలని కోరారు. మాదిగల రిజర్వేషన్లకు పూర్తి సహకారం ఉంటుందన్నారు. పది రోజులు మా కోసం పని చేయండి.. ఐదేళ్లు మీ కోసం పని చేస్తామన్నారు. మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక సెస్ విధించి నిర్వాసితులను ఆదుకుంటాం

(మొదటి పేజీ నుంచి)

ప్రాజెక్టు పనులు 2018 నాటికి 50 శాతం పూర్తయ్యాయని, వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించి ఎటిఎంగా సొమ్ము వాడుకుందని ఆరోపించారు. పోలవరం నియోజకవర్గంలోని కొయ్యలగూడెం ప్రధాన సెంటర్లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. స్థానిక జనసేన నేత కరాటం రాంబాబు ఏజెన్సీ టైగరేనని అభివర్ణించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఆయన 110 ఎకరాలు ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే పోలవరం పోలవరం కీలకమైందన్నారు. పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి రూ.33 వేల కోట్లు అవసరమవుతాయన్నారు. వైసిపి ప్రభుత్వం కేవలం ప్రభుత్వ కార్యాలయాలకు బ్లూ రంగు వేయడానికి రూ.1300 కోట్లు, వాటిని తొలగించడానికి రూ.వెయ్యి కోట్లు మొత్తం రూ.2300 కోట్లు ప్రజాధనం వృథా అయ్యిందన్నారు. పోలవరాన్ని జిల్లా కేంద్రంగా మార్చేలా చంద్రబాబుతో మాట్లాడి ప్రణాళికలు చేపడతామన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓట్లు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, జనసేన నాయకులు కరాటం రాంబాబు, జనసేన పోలవరం అభ్యర్థి చిర్రి బాలరాజు, టిడిపి చింతలపూడి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్, టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు, ఘంటా మురళీరామకృష్ణ, కరాటం సాయి పాల్గొన్నారు.

బౌన్సర్‌పై దాడి

సభ మధ్యలో బౌన్సర్‌పై గుర్తు తెలియని వ్యక్తి కుడి వైపు కొట్టడంతో గాయమైంది. ఈ సంఘటనతో ఒక్కసారిగా సభలో గందరగోళం నెలకొని ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే సభ ముగియగానే మళ్లీ ఘర్షణ చోటుచేసుకుని కొద్దిసేపు ట్రాఫిక్ సైతం స్తంభించింది.

పనిచేయని రక్త పరీక్షల యంత్రం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఏరియా ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేసే బై కెమిస్ట్రీ పుల్లి ఎక్సల్ 640 మిషన్ కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. పాత బిల్డింగ్‌లోని 3వ నెంబర్ రూమ్‌లో రోగులకు రక్త పరీక్షలు నిర్వహిస్తారు. గడిచిన ఐదు రోజుల నుంచి పనిచేయకుండా ఉంది. దీంతో ఆసుపత్రికి వచ్చి డాక్టర్‌కు చూపించుకునే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన ఐదు రోజుల నుంచి ఈ మిషన్ పనిచేయడం లేదని ఆసుపత్రి వర్గాలు తెలుపుతున్నారు. దీంతో వైద్య పరీక్షలు ఆలస్యం అవుతున్నాయని ఆసుపత్రికి వచ్చే రోగులు తెలుపుతున్నారు. దీనిపై ఇదే విషయంపై ఆసుపత్రి సూపరిటెండెంట్ ఆర్.సుప్రియను వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించామని, మిషన్ రిపేర్ చేయించేందుకు సిబ్బంది మంగళవారం వస్తారని తెలిపారు.

పితాని ర్యాలీ

ప్రజాశక్తి - పెనుగొండ

టిడిపి ఆచంట నియోజవర్గం ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ, పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్ వర్మ సిద్ధాంతం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మంగళవారం సిద్ధాంతం నుంచి వడలి, పెనుగొండ మీదగా మార్టేరు వరకూ పెద్ద ఎత్తున ర్యాలీగా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకర్ గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ గెలుపు కోసం టిడిపి, జనసేన నాయకులంతా ప్రచారం నిర్వహించారు. మండలంలోని దర్భరేవు గ్రామంలో పట్టణంలోని 2, 4వ వార్డుల్లో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేసి, రానున్న ఎన్నికల్లో నాయకర్, శ్రీనివాస్ వర్మను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వలవల నాని, బందెల రవీంద్ర, ఆకన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు 'కలిదిండి'లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఆకివీడు

ఈనెల 1వ తేదీన తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఏలూరు జిల్లా కలిదిండి మండల కేంద్రంలో ప్రత్యేకంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ 'హెూప్' నిర్వాహకులు శివ తెలిపారు. ఈ రకమైన వ్యాధిగ్రస్తులు ప్రతి 15 రోజులకు ఒకసారి కొత్త రక్తం ఎక్కించుకోవలసి వస్తుందన్నారు. అటువంటి వారికి తగిన సమయానికి రక్తం లభించక ఎన్నో అవస్తలు పడుతున్నారన్నారు. అటువంటి చిన్నారుల కోసం ఈనెల 1వ తేదీన బుధవారం కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ప్రత్యేక రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం తలసేమియా పిల్లల కోసం రక్తం ఇవ్వాలి అనుకుంటున్న వారు ఈనెల 1 ఉదయం 9 గంటల కల్లా కలిదిండి మార్కెట్ యార్డ్‌కి వచ్చి రక్తదానం చేయవచ్చునని ఆయన తెలిపారు. ఈ శిబిరంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. వివరాల కోసం 7981802608 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

'పది'లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌డిఒ

ప్రతిభకు పేదరికం అడ్డులేదని, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అన్ని సౌకర్యాలు ఉంటాయని, విద్య కోసం నిరంతర పట్టుదలతో విద్యార్థులు ఉంటే ప్రగతి సాధన సులభమవుతుందని ఆర్‌డిఒ శ్రీనివాసులు రాజు అన్నారు. మంగళవారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పదవ తరగతి ప్రతిభావంతులను ఆర్‌డిఒ శ్రీనివాసుల రాజు అభినందించారు. నేను కూడా సాధారణ రైతు కుటుంబంలో జన్మించానని, ప్రభుత్వ పాఠశాల్లో చదివానని, క్రమశిక్షణతో ముందుకు సాగితే ప్రగతి సాధించవచ్చని అన్నారు. కేవలం పాస్ మార్కుల కోసమే కాకుండా ప్రాపంచిక విషయాలలో కూడా పట్టు సాధించాలని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 582 అత్యధిక మార్కుల సాధించడం గొప్ప విశేషమని విద్యార్థులను అభినందించారు. నిర్వాహకులు రంగసాయి మాట్లాడుతూ ఈ ప్రతిభ సాధించిన విద్యార్థులకు, వెంకటేశ్వర బదిర పాఠశాల విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున భీమవరం ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ జి.రామకృష్ణంరాజు సహకారంతో నగదుతో పాటు ప్రశంసా పత్రం, మెమెంటో ఆర్‌డిఒ చేతుల మీదుగా అందించామని తెలిపారు. ఈ అవార్డులో నగదును అందుకున్న వారిలో జెఎల్‌బి మున్సిపల్ హైస్కూల్ 582(ఇద్దరు), పిఎస్ఎమ్ గర్ల్స్ హైస్కూల్ 581(ఇద్దరు), చినరంగనిపాలెం హైస్కూల్ ఒకరు అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎల్‌బి హెడ్మాస్టర్ ఇవి.శ్రీనివాస్, భీమవరం పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా ఉండాలి

ఆచంట రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు

ఆచంట: నియోజకవర్గంలో సాధారణ ఎన్నికల విధులు నిర్వహించే ప్రతిఒక్కరూ నిష్పక్షపాతంగా ఉండాలని ఆచంట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు ఆదేశించారు. మంగళవారం స్థానిక రామేశ్వర స్వామి సత్రంలో పిఒ, ఎపిఒ, ఒపిఒ, పోల్ టీమ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది ఎన్నికల ప్రవర్తనా నియమావళి మార్గదర్శకాలపై పూర్తి స్పష్టత ఉండాలన్నారు. ఇందుకు సంబంధించి అంశాలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకునేందుకు ప్రయత్నించాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 20 టీమ్‌లకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 20 మందితో రెండు దఫాలుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం ఆరు రోజులు పాటు ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈనెల 8, 9వ తేదీల్లో రెండు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒలు పి.నరసింహ ప్రసాద్, దొర, పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు : సార్వత్రిక ఎన్నికల పోటీల్లో ఉన్న వివిధ పార్టీల స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల కోడ్ ఉల్లంగించరాదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు అన్నారు. మంగళవారం పోటీలో ఉన్న వివిధ రాజకీయ పార్టీ అభ్యర్థులతో సమీక్ష సమావేశం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభ్యర్థులకు సంబంధించి ఒక బూత్‌కు ఇద్దరు చొప్పున ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని, వాటి వివరాలు అందించాలని అన్నారు. నియోజకవర్గంలో మొత్తం 187 పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ జరుగుతాయన్నారు. ఈనెల 3 నుంచి హోం ఓటింగ్ జరగనున్న దృశ్యా ప్రతి అభ్యర్థి ఇద్దరు ఏజెంట్ల వివరాలను సంబంధిత ఎంపిడిఒలకు ఫామ్ 10 ఇవ్వాలని సూచించారు. కమిషన్ హాల్‌కి మొబైల్ ఫోన్లు అనుమతించమని ఆయన అన్నారు. పోలింగ్ ఏజెంట్లకు శిక్షణ నిర్వహించాలని, శిక్షణ ఇవ్వడానికి పుస్తకాన్ని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సిఐ ఎన్.రజిని కుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ జానకమ్మ స్ఫూర్తితో పయనించండి

లయన్స్ అంతర్జాతీయ ఆహ్వానితులు డాక్టర్ ఎంవిఎస్

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రత్యేక వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కొల్లేటి తీర ప్రాంతంలో మానవతా మూర్తిగా, వైద్య దేవతగా పేరుపొందిన డాక్టర్ కె.జానకి స్ఫూర్తిగా అందరం వైద్య రంగంలో పయనిద్దామని స్థానిక వైద్య ప్రముఖులు, లయన్స్ అంతర్జాతీయ ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక లయన్స్ హాల్‌లో స్థానిక ఐఎంఎ ఆధ్వర్యంలో కీర్తిశేషులు డాక్టర్ కె.జానకి జ్ఞాపకార్థం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ ఎంవి.సూర్యనారాయణ రాజు ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో వైద్యం కనీసం అందుబాటు లేని రోజుల్లో ఎంతో ఖరీదైన, ఉన్నతమైన సేవలను అందించి, పేద ప్రజల పాలిట పెన్నిధిగా డాక్టర్ కె.జానకి పేరు పొందారని ఆయన అన్నారు. ఆమె సంస్మరణార్థం రెండు సంవత్సరాలు ఆమె జయంతి రోజున ఈ ప్రత్యేక వైద్య శిబిరం స్థానిక వైద్యులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే ఈరోజు అన్ని రోగాల వారికి పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు ఇక్కడ లయన్స్ క్లబ్ సహకారంతో తాము ఉచితంగా నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈ శిబిరంలో స్థానిక వైద్యులు పాల్గొన్నారు.

కరోనా సమయంలో నిమ్మల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పాలకొల్లు

మాట్లాడుతున్న పిఎంపి సభ్యులు

కరోనా సమయంలో కుటుంబ సభ్యులు కూడా ఒకరికొకరు పలకరించుకునే పరిస్థితి లేనప్పుడు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు బాధితుల వద్దకు వెళ్లి పలకరించి, నిత్యావసరాలు అందించడం ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. రామానాయుడుకు పిఎంపి, ఆర్ఎంపి సంఘం పాలకొల్లులో సోమవారం రాత్రి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పిఎంపి సంఘ సభ్యులు మాట్లాడుతూ కరోనా సమయంలో సేవలు చేసిన తమ సంఘ సభ్యులను గుర్తించి ఘనంగా సత్కరించడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వం కన్నా ముందుగా రామానాయుడు స్పందించి బాధితులను ఆదుకున్నారని పేర్కొన్నారు. ఇలా అనేక సందర్భాల్లో రామానాయుడు సామాన్య ప్రజలను ఆదుకున్నారని, అటువంటి వ్యక్తికి మద్దతు ఇచ్చి గెలిపించాలని అన్నారు. సంఘ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఊటుకూరి గంగాధర్ సారధ్యంలో సభ నిర్వహించారు.

ఆర్‌జిటి సెట్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రతీ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం ఆర్‌జిటి సెట్ నిర్వహిస్తున్నట్టు సంస్థ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ జి.మోహన్ మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పేద విద్యార్థులను రాష్ట్రంలోని వివిధ కార్పొరేట్, జూనియర్ కళాశాలల్లో చేర్పించి, వారి అన్ని ఫీజులను సంస్థ కడుతుందని ఆయన పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో 500కు మించి మార్కులు పొందిన పేద విద్యార్థులు ఈనెల 4వ తేదీ నుంచి 10వ తేదీ లోపు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష మే-19న జరుగుతుందని, వివరాల కోసం 08554-271353, 271354 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల ద్వారా దాళ్వా వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యాయని మండల వ్యవసాయ అధికారిణి ఎ.జ్యోతిలా తెలిపారు. మంగళవారం నాటికి సుమారు 320 మంది రైతుల ద్వారా 9,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆమె వెల్లడించారు. మండల పరిధిలో ఇంకా వరి వసూళ్ళ జరుగుతున్నాయని, ఈ వారంలో మరిన్ని టన్నుల ధాన్యం ఆర్‌బికెలకు రానున్నదని ఎఒ తెలిపారు.

ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రసాదరాజు

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం

ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రసాదరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశామన్నారు. బస్‌స్టాండ్, కాటన్ పార్క్, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించామని తెలిపారు. మండలంలోని చిట్టవరం గ్రామంలో ప్రసాదరాజు సతీమణి ముదునూరి శారద వాణి చిట్టవరం గ్రామంలోని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

బొలిశెట్టి ప్రచారం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని 29, 30 వార్డుల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను రాజకీయాల్లో నిజాయితీగా పనిచేశానని, ఇకపై కూడా అంతే నిజాయితీగా ప్రజల కష్టాల్లో తోడుంటానన్నారు. అవినీతికి పరాకాష్టగా తాడేపల్లిగూడెన్ని దోచేసిన కొట్టు సత్యనారాయణను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, రఘురాం ఉన్నారు.

'ల్యాండ్ టైట్లింగ్ యాక్టు టిడిపి కుట్ర'

తణుకురూరల్: ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయలేదని, అదంతా టిడిపి రాజకీయ కుట్రలో భాగమేనని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి కారుమూరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ విధానాన్ని చంద్రబాబు తన దుర్మార్గపు పచ్చ సామాజిక మాధ్యమాల్లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసినట్లుగా అసత్య ప్రచారం చేస్తున్నాడని అన్నారు. తప్పుడు కథనాలు సృష్టించే పచ్చ సామాజిక మాధ్యమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సొమ్మసిల్లిన పితాని

ప్రజాశక్తి - ఆచంట

ప్రచారరథంపై ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి, టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. మండలంలోని కొడమంచిలి పంచాయతీ పరిధి బండివారిపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా మధ్యాహ్నం సమయంలో ఆయన సొమసల్లి పడిపోయారు. దీంతో టిడిపి కార్యకర్తలు పితాని సత్యనారాయణను ప్రచారరథంపై నుంచి కిందకు దింపి ఎసి కారులో సమీపంలోని కందరవల్లి గ్రామంలో ఉన్న టిడిపి కార్యకర్త బోడపాటి దుర్గాప్రసాద్ ఇంటికి తరలించారు. స్థానికంగా ఉన్న మెడికల్ సిబ్బంది పితాని సత్యనారాయణను పరీక్షించి రెండు సెలైన్స్ ఎక్కించారు. అనంతరం పితాని సత్యనారాయణ సుమారు రెండు గంటల పాటు విశ్రాంతి తీసుకున్నారు. మళ్లీ నాలుగు గంటలకు తిరిగి ప్రచారం చేపట్టారు. ఉదయం తొమ్మిది గంటలకు సిద్ధాంతంలో ప్రారంభమైన ప్రచారం ఆచంట వచ్చేసరికి మధ్యాహ్నం ఒంటి గంట దాటింది. ఎండ ధాటికి పితాని సొమ్మసిల్లి పడిపోయారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

రానున్న ఎన్నికల్లో నిత్యం ప్రజల పక్షాన పోరాడే ఇండియా వేదికను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఏలూరు సిపిఐ ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. చొదిమెళ్ల, రాజరాజేశ్వరి నగర్, బాలాజీ నగర్, టైటస్ నగర్, అశోక్ నగర్, నరసింహరావు పేటలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రభాకర్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా తంగెళ్లమూడి సెంటర్‌లో జరిగిన ప్రచారసభలో డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపికి మరోసారి అవకాశం ఇస్తే దేశం అంధకారం అవుతుందని హెచ్చరించారు. కేంద్రంలోకి నరేంద్ర మోడీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రజలపై నిత్యావసర వస్తువుల ధరల భారం మోపుతూ సంపన్నులకు దోచిపెడుతుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా వ్యాపారాలు పూర్తిగా కుంటుపడ్డాయన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను అదాని, అంబానీలకు కారుచౌకగా కట్టబెడుతున్న కారణంగా యువత ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు నగరంలో సమస్యలు తిష్ట వేశాయని, స్థానిక ఎంఎల్ఎ హయాంలో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో సిపిఐ ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యను గెలిపించి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సమస్యల పరిష్కారానికి చట్టసభలకు పంపాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఎఐటియుసి నాయకులు కడుపు కన్నయ్య పాల్గొన్నారు.

బిజెపి పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలి

కాంగ్రెస్ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి సీతారామ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్


ప్రచారంలో అంకెం సీతారామ్

కేంద్రంలో అధికారం చేపట్టబోయేది ఇండియా వేదికేనని కాంగ్రెస్ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంకెం సీతారామ్ అన్నారు. భీమవరం ఒకటో పట్టణంలోని గునుపూడి, తాడేరు, ఇందిరమ్మ కాలనీ పలు గ్రామాల్లో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ముఖ్యంగా తాడేరులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, ఇండియా వేదిక అధికారంలోకి రాగానే ప్రత్యేకించి వాటర్ ట్యాంకర్ నిర్మాణం చేపడతామని చెప్పారు. భీమవరం పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దేశంలో బిజెపి అరాచక వల్ల ప్రజలు విసుగు చెందారన్నారు. ఇండియా వేదికతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. బిజెపి పాలనలో ప్రజలకే భద్రత లేదన్నారు. వెనకబడిన తరగతుల వారికి న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపన సుబ్రహ్మణ్యరాజు (జెఎస్ఆర్), సిపిఐ, సిపిఎం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, ఎం.వైకుంఠరావు, పశ్చిమగోదావరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోమునాగ కేశవ్‌బాబు, జిల్లా స్టూడెంట్ అధ్యక్షులు చింతగుంట మహేష్, రాష్ట్ర కార్యదర్శి దుండి రవివర్మ, భీమవరం యూత్ పట్టణ అధ్యక్షులు బోనం రవికుమార్, భీమవరం మండల యూత్ అధ్యక్షులు మణికంఠ, ముత్యం విజయకుమార్, పాకెర్ల బాబ్జి, కూరెళ్ల సాయి వెంకటరామరాజు, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

తండ్రి, కుమార్తె మృతి

తల్లి, కుమారుడికి తీవ్ర గాయాలు

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్, ఉంగుటూరు

రాము, తేజస్విని(ఫైల్)

కొత్త బైక్ కొనుగోలు చేసి ఆనందంగా ఆ దంపతులు తమ కుమార్తె, కుమారుడిని తీసుకుని దైవ దర్శనానికి వెళ్లారు. వారు దైవ దర్శనం చేసుకుని పిల్లలకు బొమ్మలు కొని ఇంటికి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో తండ్రి, కుమార్తె అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఏలూరు జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పెదపాడు ఎస్ఐ శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కైకరం ప్రాంతానికి చెందిన యవ్వారి రుద్రరాము (40) స్థానికంగా సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. అతనికి వికలాంగురాలైన భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇటీవల కాలంలో ఆయన కొత్త బైక్ కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో వారు బైక్‌పై విజయవాడ దుర్గమ్మ దర్శనానికి వెళ్లారు. సోమవారం రాత్రి ఏలూరులోని వారి బంధువుల ఇంటికి వెళ్లి ఆ రాత్రి అక్కడే ఉన్నారు. మరుసటి రోజు మంగళవారం ఉదయం విజయవాడ దుర్గమ్మ దర్శనానికి వెళ్లారు. దైవదర్శనం అనంతరం తిరిగి కైకరం బయలుదేరారు. వీరు కలపర్రు టోల్ ప్లాజా సమీపానికి వచ్చేసరికి బైక్ అతివేగంతో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాము, అతని కుమార్తె తేజస్విని (8) అక్కడికక్కడే మృతి చెందారు. రాము భార్య నాగ శిరీష, కుమారుడు నాగ కౌసిక్ తీవ్ర గాయాలపాలయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పెదపాడు పోలీసులు క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఎస్ఐ శుభ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగ వ్యతిరేక శక్తుల ఓటమే మేడే కర్తవ్యం - సిఎస్‌లో
నేడే మేడే.. - 8లో
అంగన్‌వాడీల విజయ గీతిక.. - 6లో
కార్మిక వర్గం.. పుంజుకుంటున్న నయా పాసిజం - 2లో
సీన్ రివర్స్.. బతకడానికి పల్లెబాట - 7లో
రైతులు ఎందుకు ఉద్యమిస్తున్నారు..? - 3లో

ప్రజాశక్తి

మేడే ప్రత్యేక అనుబంధం

8 పేజీలు | ఏలూరు, పశ్చిమగోదావరి | బుధవారం 1-5-2024

అరుణ పతాక తారకు జేజేలు

మేడే....ఓ మహత్తర పోరాటం పురుడుపోసుకున్న రోజు. ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికులు రక్తం చిందించిన రోజు. అంతేకాదు ఓ అరుణతారను శ్రామికులకు, కష్టజీవులకు అందించిన రోజు. 18వ శతాబ్దంలోనే యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా పారిశ్రామికీకరణను ప్రారంభించిన పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు....శ్రామిక ప్రజల శ్రమశక్తిని నిలువెల్లా దోచుకున్నారు. ఇందుకోసం శ్రామికులకు అమానుష శిక్షలు వేయడం.. చివరకు కొట్టి చంపడం వంటి క్రూరాతి క్రూరంమైన చర్యలకు తెగబడ్డారు. ఈ నేపథ్యంలో 1886 మేలో అమెరికా దేశం చికాగో నగరంలోని హే మార్కెట్లో సమ్మె చేస్తున్న నలుగురు కార్మిక నేతలను పెట్టుబడిదారులు కాల్చి చంపారు. మే 4న మరో నలుగురు కార్మికులను కోర్టులో విచారించి 1887 నవంబర్ 11న నిర్ధాక్షిణ్యంగా ఉరివేసి చంపారు. దీంతో కార్మిక లోకం ఉవ్వెత్తున ఎగసింది. శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతమైన అరుణ పతాకం రెపరెపలాడింది. అదే నేటికీ దోపిడీకి గురువుతున్న శ్రామికులకు, కార్మికులకూ వెలుగు దిక్సూచిగా ఉంది. అలాగే కార్మిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మే డే రోజునే (1913 మే 1న) దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, భారత దేశ కార్మికవర్గ పార్టీ అగ్రనేత, పేదల పెన్నిధి, మహోన్నత నేత పుచ్చలపల్లి సుందరయ్య గారు జన్మించారు. ఆ మహానేత జయంతినీ శ్రామికులు, కార్మికులు...యావత్ ప్రజానీకం జరుపుకుంటూ స్ఫూర్తి పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే మే డే దీక్షా దినానికి ఎంతో ప్రత్యేకత ఉంది. మేడే విశిష్టత, మహానేత సుందరయ్య స్ఫూర్తిదాయక జీవితం, పాలకుల విధానాల కారణంగా వివిధ రంగాలపై పడుతున్న ప్రభావాలపై అనేక వ్యాసాలతో ప్రజాశక్తి ఈ ప్రత్యేక సంచికను తీసుకొస్తోంది. ఎప్పటిలాగే ఆదరిస్తారని ఆశిస్తూ...



నేడు మేడే కార్యక్రమాల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఆకివీడు

మేడే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ అనుమతించిందని, ఆ మేరకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని సిఐటియు మండలాధ్యక్ష కార్యదర్శులు పెంకి అప్పారావు, కడగల తవిటినాయుడు అన్నారు. మేడే సందర్భంగా కార్మికులు తమ పని ప్రదేశాల్లో, నివాస ప్రాంతాల్లో ఉదయాన్నే సిఐటియు జెండా ఆవిష్కరించాలని చెప్పారు. ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక వెలంపేట రామాలయం వద్ద నిర్వహించే సభకు హాజరవ్వాలని కోరారు. సభ అనంతరం కార్మిక ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల పూర్తి వివరాలను తెలుపుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందిని, నగర పంచాయతీ కమిషనర్‌ను కలిసి విజ్ఞాపన పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డొకల రవితేజ, గేదెల ధనుష్ పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి విజ్ఞాపన పత్రం అందిస్తున్న నేతలు

కార్మిక వర్గం - పుంజుకుంటున్న నయా ఫాసిజం

- ప్రభాత్ పట్నాయక్



జర్మనీలో కార్మికవర్గ విప్లవం విఫలమైన తర్వాత ఫాసిజం బలంగా ముందుకొచ్చిందని బెంజమిన్ చేసిన సూత్రీకరణ ప్రాతిపదికన ఇప్పుడు మనం పరిశీలిస్తే...నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా కార్మిక వర్గ పోరాట శక్తి బలహీన పడిన నేపథ్యంలో నయా ఫాసిజం ముందుకు రావడం కనిపిస్తుంది. దానికి ఆర్థిక సంక్షోభం తీవ్రతరం కావడం తోడైంది. నయా ఫాసిస్టు శక్తులు బలం పుంజుకోవడం వెనుక ఈ నేపథ్యాన్ని చూడాలి. దీనినిబట్టి కేవలం కార్మికవర్గ పోరాటశక్తి బలహీనపడడమే నయా ఫాసిజం బలపడడానికి కారణం అన్న నిర్ధారణకు రాకూడదు. నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అనివార్యంగా తలెత్తే ఆర్థిక సంక్షోభం కార్మికోద్యమం బలహీన పడిన నేపథ్యంలో సంభవించింది. ఈ పరిస్థితి నయా ఫాసిస్టు శక్తుల బలం పెరగడానికి దోహదం చేసింది.

జర్మన్ తత్వవేత్త వాల్టర్ బెంజమిన్ స్వయంగా ఫాసిస్టు శక్తుల చేతుల్లో బాధితుడు. ఫాసిజం సమాజంలో పై చేయి సాధించడానికి, దానికి ముందు కాలంలో శ్రామికవర్గ విప్లవం విఫలం అవడానికి సంబంధం ఉందని ఆయన అన్నాడు. ఆయన దృష్టిలో జర్మనీ అనుభవాలు ప్రధానంగా ఉన్నాయి. 1917 బోల్షివిక్ విప్లవం విజయం సాధించిన అనంతరం, అదే మాదిరిగా జర్మనీలోనూ విప్లవాన్ని సాధించాలన్న ప్రయత్నాలు చాలానే జరిగాయి. కాని ఆ ప్రయత్నాలు ఏవీ విజయవంతం కాలేకపోయాయి. దాంతో అలసిపోయిన కార్మికవర్గం కమ్యూనిస్టులుగా, సోషల్ డెమాక్రాట్లుగా చీలిపోయింది. ఆ సోషల్ డెమాక్రాట్లు అధికారంలో ఉన్న కాలంలో కమ్యూనిస్టులైన రోజా లక్సెంబర్గ్, కార్ల్ లీబ్‌నెక్ట్ తదితరులు హత్యగావించబడ్డారు. దాంతో ఈ రెండింటి మధ్య రాజీకి గాని, సర్దుబాటుకు గాని అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో 1930 దశకంలో ఆర్థిక సంక్షోభం ఆవరించింది. అప్పుడు ఫాసిస్టు శక్తులు తేలికగా అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. వాటికి గుత్త పెట్టుబడిదారీ వర్గం, అందునా అందులో కొత్తగా తలెత్తిన శక్తులు దన్నుగా నిలిచాయి.

బెంజమిన్ చేసిన సూత్రీకరణ ఇక్కడ ప్రాధాన్యత కలిగివుంది. బలపడుతున్న కార్మికోద్యమానికి పాలకవర్గ ప్రతిస్పందనగా ఫాసిజం తలెత్తుతుంది అన్న నిర్ధారణకు ఈ సూత్రీకరణ భిన్నమైనది. కార్మికోద్యమ పురోగమనం ఆగిపోయిన సందర్భంలో, మళ్ళీ ఆ కార్మికోద్యమం బలం పుంజుకోకుండా చేయడానికి పాలకవర్గం ఫాసిజాన్ని బలపరుస్తుంది అని ఈ సూత్రీకరణ చెప్తుంది. ఆర్థిక సంక్షోభం కారణంగా పేదరికం, నిరుద్యోగం హెచ్చు స్థాయిలో పెరిగిన నేపథ్యంలో కార్మికోద్యమం మళ్ళీ బలం పుంజుకోకుండా చేయడానికి పాలకవర్గం ఫాసిజాన్ని బలపరుస్తుంది అని అంటుంది. ప్రస్తుతం అనేక ప్రపంచ దేశాల్లో నయా ఫాసిజం బలంగా ముందుకొస్తోంది. భారతదేశంతోబాటు, హంగరీ, అర్జెంటినా, బ్రెజిల్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా వంటి దేశాల్లో ఈ విధమైన పరిణామాలను మనం చూస్తున్నాం. ఐతే, ఈ నయా ఫాసిజం బలపడడానికి ముందు ఈ దేశాల్లో ఎక్కడా కార్మికవర్గ విప్లవాలు విఫలమైన సందర్భాలు లేవు. కాని, బెంజమిన్ ప్రస్తావించిన పరిస్థితి మాత్రం నెలకొంది. ఈ దేశాలలో కార్మికోద్యమాలు బలహీనపడ్డాయి. నయా ఉదారవాద వ్యవస్థ పని చేసిన తీరు ఈ పరిస్థితికి దారి తీసింది. కనీసం మూడు వేరు వేరు మార్గాల్లో నయా ఉదారవాదం కార్మికోద్యమాన్ని బలహీనపరుస్తుంది.

మొదటిది: కార్మికోద్యమం జాతీయ ప్రాతిపదికన తన ఉద్యమాన్ని సంఘటితం చేసుకుంటూ ఉంటుంది. కాని రెండోపక్కన పెట్టుబడి మాత్రం ప్రపంచవ్యాప్త స్వభావాన్ని సంతరించుకుంది. జాతీయ స్థాయిలో సంఘటితమైన కార్మికోద్యమం వద్ద ఉన్న సమ్మె అనే ఆయుధంతో అంతర్జాతీయ స్థాయిలో సంఘటితమైన పెట్టుబడిని ఎదుర్కొని నిలవరించడం కష్టం. ఒకవేళ కార్మికవర్గం సమరశీలంగా వ్యవహరించి పోరాటానికి పూనుకుంటే అంతర్జాతీయ పెట్టుబడి వేరే దేశానికి తన పెట్టుబడులను తరలిస్తానని బెదిరిస్తుంది. అందువలన కార్మికవర్గ సమరశీలతకి పరిమితులు ఏర్పడతాయి. అమెరికాలో సగటు పురుష కార్మికుడి నిజ వేతనం 1968లో ఏ స్థాయిలో ఉందో, అంతకన్నా తక్కువ స్థాయిలో 2011 నాటికి ఉన్నది అని ప్రముఖ ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిట్జ్ వివరించాడు. కార్మికవర్గ పోరాట శక్తి ఎంతగా కుదించుకుపోయిందో దీనిని బట్టి గ్రహించవచ్చు.

రెండవది: కార్మికవర్గపు రిజర్వు సైన్యం (నిరుద్యోగులు) పనిలో ఉన్న కార్మికవర్గంతో పోల్చినప్పుడు పెరుగుతోంది. ఇదేదో సంక్షోభం ఆవరించిన తర్వాత వచ్చిన పరిణామం అనుకోకూడదు. అంతకు ముందే, సంపన్న పశ్చిమ దేశాల నుండి పెట్టుబడిని వెనుకబడిన మూడవ ప్రపంచ దేశాలకు తరలించిన కారణంగా నిరుద్యోగం పెరగడం ఎక్కువైంది. దీని వలన సంపన్న దేశాలలో అంతవరకూ ఉన్న ఉద్యోగాలు తగ్గిపోయాయి. మరోపక్క మూడవ ప్రపంచ దేశాలలో చిన్న స్థాయి ఉత్పత్తి వ్యవస్థ మీద, ముఖ్యంగా రైతాంగ వ్యవసాయం మీద కొత్తగా వస్తున్న అంతర్జాతీయ పెట్టుబడి దాడి చేసి విధ్వంసం చేసిన కారణంగా ఆ చిన్న ఉత్పత్తిదారులు, చేతివృత్తుల తరగతులు, పేద రైతాంగం సర్వమూ కోల్పోయి వీధిన పడుతున్నారు. వీరందరూ బతుకుతెరువు కోసం పట్టణాలకు వలసలు పోతున్నారు. ఇప్పటికే పట్టణాలలో ఉన్న ఉద్యోగావకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. దానికి తోడు ఈ వలసలు పెరగడం వలన ఉద్యోగాల కోసం పోటీ తీవ్రమౌతోంది. దీని ఫలితంగా కార్మికవర్గం బలహీన పడుతోంది. ఆర్థిక సంక్షోభం తలెత్తకమునుపే ఈ పరిణామం మొదలైంది.

మూడవది: నయా ఉదారవాద విధానాలలో భాగంగా ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం జరుగుతోంది. సాధారణంగా ప్రైవేటు రంగంలో కన్నా ప్రభుత్వ రంగంలో కార్మికులు మెరుగ్గా సంఘటితం అవుతారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్నదే. ఉదాహరణకు: అమెరికాలో ప్రైవేటు రంగంలో 7 శాతం మంది కార్మికులు యూనియన్లలో సంఘటితం అయివున్నారు. అదే ప్రభుత్వ రంగంలో చూస్తే (విద్యారంగం కూడా కలుపుకుని) 33 శాతం యూనియన్లలో ఉన్నారు. ప్రైవేటీకరణ విధానం వలన కార్మికవర్గపు సంఘటిత శక్తి సన్నగిల్లిపోతుంది. ఐతే ఈ అంశాన్ని దాదాపు ఎవరూ చర్చించడం లేదు. ప్రైవేటీకరణ ఫలితంగా సృజనాత్మకత దెబ్బ తింటుందని, దేశ ఆర్థిక వ్యవస్థ తన స్వావలంబనను కోల్పోతుందని, పెట్టుబడి మరింతగా పరాన్నభుక్కుగా దిగజారుతుందని చర్చలు జరుగుతున్నాయి కాని, అది కార్మికవర్గ పోరాట శక్తిని దెబ్బ తీస్తుందన్న విషయాన్ని ఎక్కువగా చర్చించడం లేదు.

కార్మికవర్గ పోరాట శక్తి బలహీనపడింది అంటే దానర్థం స్వల్పకాలిక, భారీ జాతీయ సమ్మెలు కూడా చేపట్టలేరని అనుకోకూడదు. అటువంటి సమ్మెలు మనం గడిచిన కొన్ని సంవత్సరాలలో మన దేశంలో ఎక్కువగానే జరిగాయి. కాని ఆ యా రంగాలకు సంబంధించిన నిర్దిష్ట డిమాండ్లతో, అవి నెరవేరేవరకూ దీర్ఘకాలం పాటు సమ్మెలు కొనసాగించడం అనేది మనకు ఇప్పుడు కనపడదు. అటువంటి సమ్మెలు 1970 దశకంలో మన దేశంలో చాలా జరిగాయి. రైల్వే కార్మికుల సమ్మె, అంతకు ముందు జరిగిన లోకో రన్నింగ్ కార్మికుల సమ్మె వంటివి నిర్వహించగల పరిస్థితి ఇప్పుడు దాదాపు లేదు. జర్మనీలో కార్మికవర్గ విప్లవం విఫలమైన తర్వాత ఫాసిజం బలంగా ముందుకొచ్చిందని బెంజమిన్ చేసిన సూత్రీకరణ ప్రాతిపదికన ఇప్పుడు మనం పరిశీలిస్తే, నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా కార్మిక వర్గ పోరాట శక్తి బలహీన పడిన నేపథ్యంలో నయా ఫాసిజం ముందుకు రావడం కనిపిస్తుంది. దానికి ఆర్థిక సంక్షోభం తీవ్రతరం కావడం తోడైంది. నయా ఫాసిస్టు శక్తులు బలం పుంజుకోవడం వెనుక ఈ నేపథ్యాన్ని చూడాలి.

దీనినిబట్టి కేవలం కార్మికవర్గ పోరాటశక్తి బలహీనపడడమే నయా ఫాసిజం బలపడడానికి కారణం అన్న నిర్ధారణకు రాకూడదు. నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అనివార్యంగా తలెత్తే ఆర్థిక సంక్షోభం కార్మికోద్యమం బలహీన పడిన నేపథ్యంలో సంభవించింది. ఈ పరిస్థితి నయా ఫాసిస్టు శక్తుల బలం పెరగడానికి దోహదం చేసింది.

బూర్జువా ఉదారవాదులు ఈ అంత:సంబంధాన్ని పరిగణించరు. సమాజాన్ని వర్గ ప్రాతిపదికన పరిశీలించడానికి వారు అంగీకరించరు. వ్యక్తులుగానో, వర్గేతర ప్రాతిపదికన వ్యక్తుల సమూహాలుగానో మాత్రమే వారు పరిశీలిస్తారు. దానికి తోడు వారు నయా ఉదారవాదాన్ని సమర్థిస్తారు. అందువల్లనే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఒకే కాలంలో నయా ఫాసిజం ఎందుకు పుంజుకుంటోందో వారు వివరించలేకపోతున్నారు. ట్రంప్, మోడీ, బోల్సనారో, మైలీ, మెలోనీ వంటి నాయకులు ఇప్పుడే ఎందుకు బలంగా ముందుకొస్తున్నారో వారు గ్రహించలేకపోతున్నారు. ఇంతమంది ఫాసిస్టు స్వభావం కలిగిన నియంతలు ఏక కాలంలో బలపడడం వెనుక ఉమ్మడి అంతర్జాతీయ సందర్భం ఏమిటన్నది వారు తెలుసుకోవాలి. కొంతకాలంగా నయా ఉదారవాద విధానాల అమలు జరిగి దాని ఫలితంగా కార్మికోద్యమ పోరాట శక్తిని దెబ్బ తీసిన తర్వాత అవే విధానాల కారణంగా ఆర్థిక సంక్షోభం నెలకొని దానినుండి బైటపడే దారి తోచని స్థితి ఏర్పడడమే ఆ ఉమ్మడి కారణం. తమ తమ దేశాల్లో మెజారిటీ ప్రజల ముందు "పరాయివాళ్ళు" అని కొన్ని సమూహాలపై ముద్ర వేసి విద్వేష భావనలు రెచ్చగొడుతున్న వాతావరణం ఈ అన్ని దేశాల్లోనూ నెలకొంది. ఎటొచ్చీ ఆ "పరాయివారు" ఎవరన్నది ఆ యా దేశాన్ని బట్టి మారిపోతూ వుంటుంది. కాని ఎవరినో కొందరిని "పరాయివారి" గా చిత్రించడం మాత్రం ఉమ్మడి ధోరణిగా ఉంది. దాని వెనుక ఉన్న ఉమ్మడి సందర్భం ప్రస్తుతం నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం.

దీనినుండి అనేక నిర్ధారణలకు రావచ్చు. మొదటిది: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే బలమైన కార్మిక సంఘాలను నిర్మించడం తప్పనిసరిగా జరగాలి. బూర్జువా ఉదారవాదం ఇందుకు పూర్తి వ్యతిరేకం. కార్మిక సంఘాల పట్ల వారు శత్రుపూరిత వైఖరితో వ్యవహరిస్తారు. సమ్మెలు చేయడం అంటే సమాజాన్ని (పబ్లిక్‌ని) ఇబ్బందులపాలు చేసి తమ డిమాండ్లను నెగ్గించుకోవమే అని వారు విమర్శిస్తారు. వారికి శ్రమజీవుల పేదరికం, దుర్భర పరిస్థితులు ఏమాత్రమూ పట్టవు. అంతేగాక వారికి ఈ సమాజం ఏ ప్రాతిపదికన నడుస్తోందో కూడా పట్టదు. నిజానికి వారు చెప్పే స్వేచ్ఛ అనేది వ్యక్తులందరికీ ఉండాలంటే, ఆ స్వేచ్ఛను కాపాడే మొనగాడిగా కార్మికవర్గం బలంగా ఉండడం అత్యంత కీలకం. కాని ఉదారవాదులు వ్యక్తుల స్వేచ్ఛను గుర్తిస్తూనే, ఆ వ్యక్తులందరి సమూహంగా ఉండే కార్మిక సంఘం యొక్క స్వేచ్ఛను మాత్రం అంగీకరించరు. కలిసికట్టుగా ఉంటూన్నప్పుడే స్వేచ్ఛను పొందలేని పరిస్థితి ఉన్నప్పుడు ఇక వ్యక్తులుగా విడిగా స్వేచ్ఛను అనుభవించడం ఎలా సాధ్యమో వారు వివరించలేరు.

ఇక రెండవది: ప్రజాస్వామ్యం ఉండాలంటే ప్రభుత్వ రంగం ఉండడం తప్పనిసరి. ఉదారవాదులు దీనిని కూడా వ్యతిరేకిస్తారు. ప్రైవేటు సంస్థలు, ఉదార ప్రజాస్వామ్యం ఒకదానికొకటి బలపరుచుకుంటాయని వారు భావిస్తారు. ఒక ఆర్థిక వ్యవస్థలో మొత్తం అంతా ప్రైవేటు రంగమే విస్తరించి వుంటే, ప్రభుత్వ రంగం ఉనికి నామమాత్రం అయితే, అప్పుడు ప్రజానీకానికి అత్యవసర సేవలను వారి ఆర్థిక స్తోమతకు తగ్గ ధరలకు అందించడం ఏ విధంగా సాధ్యం? సాంకేతికంగా కొంతైనా స్వావలంబనను సాధించడం ఎలా? ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ఎలా? ఈ ప్రశ్నలకు ఉదారవాదుల దగ్గర సమాధానాలు ఉండవు. ప్రభుత్వ రంగం ఉంటే కార్మిక సంఘాలు బలంగా ఉంటాయి. కార్మిక సంఘాలు బలంగా ఉంటే ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవడం సాధ్యం. దీనర్థం దేశమంతటా ప్రైవేటు రంగం విస్తరించివుంటే నయా ఫాసిజం బలపడిపోతుందని మాత్రం కాదు. ప్రైవేటు రంగం మాత్రమే బలంగా ఉంటే నయా ఫాసిస్టు దాడికి సులువుగా బలి చేయబడతాం అని మాత్రమే.

"ద్రవ్య పెట్టుబడి యొక్క అత్యంత ప్రతీఘాత, తిరోగమన తరగతుల బహిరంగ, ఉగ్రవాద నియంతృత్వమే ఫాసిజం" అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏడవ మహాసభలో జార్జి డిమిట్రోవ్ వివరించారు. అది కార్మిక సంఘాలను అణచివేస్తుందని, కార్మిక నాయకులను నిర్బంధించి వేధింపులకు గురి చేస్తుందని బిషప్ నీమోల్లర్ వ్యాఖ్యానించారు. ఈ ఫాసిజం బలం పుంజుకోడానికి ప్రధానంగా తీవ్రమౌతున్న ఆర్థిక సంక్షోభం, కార్మికసంఘాలు బలహీనపడడం దోహదం చేస్తున్నాయి.

అందుచేత నయా ఫాసిస్టు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం సాగాలంటే కేవలం రాజకీయంగా కూటములు ఏర్పరచడం ఒక్కటే సరిపోదు. ఆ వ్యూహంలో కార్మికోద్యమాన్ని బలోపేతం చేసి కార్మికవర్గం పుంజుకునేలా చేయడం, కార్మిక-కర్షక ఉద్యమాల నడుమ సమన్వయాన్ని (ప్రస్తుతం భారతదేశంలో ఈ సమన్వయం పెరుగుతోంది) పెంపొందించడం చాలా ముఖ్యం. ◆

(స్వేచ్ఛానుసరణ)

రైతులు ఎందుకు ఉద్యమిస్తున్నారు?

మోడీ ప్రభుత్వం నల్లచట్టాలను దొడ్డిదారిన అమలు చేయడమే కాక, విద్యుత్ బిల్లు ఆధారంగా వ్యవసాయ పంపుసెట్లకు మోటర్లు బిగించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అమలు చేయిస్తున్నది. కనీస మద్దతు ధర అమలు కోసం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. అందుకే నాడు కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని దేశవ్యాప్తంగా రైతు సంఘాల సమాఖ్య వివిధ రూపాల్లో ఉద్యమిస్తున్నది. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మరోసారి పంజాబ్, హర్యానా రాష్ట్రాల రైతులు ఢిల్లీ చుట్టూ చేరి ఉద్యమిస్తున్నారు. అకస్మాత్తుగా కొందరు రైతులు చేస్తున్న పోరాటం కాదు ఇది. అనేక దశబ్దాలుగా వ్యవసాయం పట్ల, గ్రామీణ పేద, మధ్యతరగతి ప్రజల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం.

వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చిన మోడీ ప్రభుత్వం, ఆయన సిఫారస్సుల అమలు కోసం ఉద్యమిస్తున్న రైతుల మీద మాత్రం బుల్లెట్లను ప్రయోగిస్తున్నది. వ్యవసాయాన్ని కాపాడుకోవాలని రైతులు ఉద్యమిస్తుంటే, కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అందుకే రెండు పక్షాలు భీకరంగా పోరాడుతున్నాయి. మీడియా, పోలీసు, అధికార యంత్రాంగంతో పాటు ఆర్‌ఎస్‌ఎస్ సోషల్ మీడియా చేస్తున్న అన్ని రకాల దాడులను ప్రతిఘటిస్తూ దేశ రాజధాని సమీపంలో వేలాదిమంది రైతులు పట్టు విడవకుండా పోరాడుతూనే వున్నారు. దీనిలో ఒక యువ రైతు పోలీసు బుల్లెట్‌కు బలయ్యాడు. ముళ్ళ కంచెలను, ఇనుప చువ్వలను, నీటి ఫిరంగులను, రబ్బరు బుల్లెట్లను, పోలీసు కాల్పులను లెక్క చేయకుండా 13 డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 13 నుండి ఉద్యమిస్తున్నారు. ఇప్పటికీ ఐదు సార్లు రైతుల ప్రతినిధులతో చర్చలు జరిపామంటున్న ప్రభుత్వం ఏ డిమాండ్లు నెరవేర్చిందో చెప్పడంలేదు.

హామీలను అమలు చేయని మోడీ

లక్షలాది రైతులు దేశ రాజధాని సరిహద్దుల్లో 2020 నవంబర్ 26 నుండి సుమారు రెండు సంవత్సరాల పాటు భైఠాయించి కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడారు. అలాగే విద్యుత్ బిల్లు-2020ను ఉపసంహరించుకోవాలని, లఖింపురిలో ఆందోళన చేస్తున్న రైతులపై అధికార మదంతో జీపును నడిపి రైతుల మరణాలకు కారణమైన కేంద్రమంత్రి కుమారుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. మొక్కవోని పోరాటంలో చలికి, వానకు, ఎండకు అంతకంటే భయంకరమైన కరోనా మహమ్మారికి 700 మందికి పైగా అన్నదాతలు అమరులయ్యారు. కేంద్ర ప్రభుత్వం, పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టిన అక్రమ కేసులకు వేలాది మంది రైతులు గురయ్యారు. నిందారోపణలను ఎదుర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం గ్రామీణ ప్రజలు నడిపిన సుదీర్ఘ పోరాటం అది. 1990 తరువాత ప్రపంచీకరణ విధానాలపై తీవ్రస్థాయి ప్రతిఘటన అది. మోడీ కళ్ళు తెరిపించి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పించిన ఉద్యమం అది. ఆ సందర్భంగా మూడు వ్యవసాయ చట్టాల అమలును వాయిదా వేసుకుంటున్నామని, పంటలకు కనీస మద్దతు ధర అమలు చేసేందుకు కమిటీ వేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో రైతులు ఉద్యమాన్ని ఆపేశారు. అయితే మోడీ ప్రభుత్వం నల్లచట్టాలను దొడ్డిదారిన అమలు చేయడమే కాక, విద్యుత్ బిల్లు ఆధారంగా వ్యవసాయ పంపుసెట్లకు మోటర్లు బిగించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అమలు చేయిస్తున్నది. కనీస మద్దతు ధర అమలు కోసం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. అందుకే నాడు కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని దేశవ్యాప్తంగా రైతు సంఘాల సమాఖ్య వివిధ రూపాల్లో ఉద్యమిస్తున్నది. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మరోసారి పంజాబ్, హర్యానా రాష్ట్రాల రైతులు ఢిల్లీ చుట్టూ చేరి ఉద్యమిస్తున్నారు. అకస్మాత్తుగా కొందరు రైతులు చేస్తున్న పోరాటం కాదు ఇది. అనేక దశబ్దాలుగా వ్యవసాయం పట్ల, గ్రామీణ పేద, మధ్యతరగతి ప్రజల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం.



ప్రపంచ జనాభాలో మన దేశ జనాభా 17 శాతం. ప్రపంచ భూమిలో కేవలం 2.4 శాతం మాత్రమే వున్న దేశం మనది. దేశ జనాభాలో 48.6 శాతం మంది ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి గ్రామాల్లో జీవిస్తున్నారు. ఈ లెక్కలు మన భూమికి, వ్యవసాయానికి ఉన్న ప్రాధాన్యతలను చెబుతున్నాయి. దేశ జనాభాకు అవసరమైన ఆహారం, వారి కొనుగోలు శక్తి పెరిగి తద్వారా పారిశ్రామికాభివృద్ధి జరగాలంటే ప్రభుత్వాలు వ్యవ సాయానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. అనేక విషాదాల అనుభవాల నుండి వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకున్నాము. 1950-1990 మధ్య దేశ జనాభా పెరుగుదల 2.5 శాతం ఉంటే వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల 3.4 శాతానికి చేరింది. 1980-90 మధ్య వ్యవసాయ ఉత్పత్తులు సగటు నాలుగు శాతం పెరుగుదల సాధించాయి. 1991 నుండి ప్రారంభమైన ప్రపంచీకరణ విధానాలు వ్యవసాయాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. 1990 చివరి నాటికి వ్యవసాయం తిరోగమనంలోకి దిగజారి దాని ఉత్పత్తులు మైనస్ 2 శాతానికి పడిపోయాయి. దీనివల్ల ఆహారధాన్యాలను విదేశాల నుండి దిగుమతి చేసుకోవలసిన పూర్వ పరిస్థితి వచ్చింది. గత పదేళ్ళ నరేంద్ర మోడీ పాలన వ్యవసాయాన్ని పూర్తిస్థాయి సంక్షోభంలోకి నెట్టి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి సిద్ధమయ్యింది. అందుకే రైతులు పోరాడుతున్నారు.

దేశంలో 14.58 కోట్ల రైతు కుటుంబాల కింద 38.82 కోట్ల ఎకరాల సాగు భూమి వుంది. ఇందులో ఐదు ఎకరాల లోపు ఉన్న రైతు కుటుంబాలు 12.57 కోట్లు కాగా, వీరి వద్ద వున్న భూమి మాత్రం 18. 38 కోట్ల ఎకరాలు మాత్రమే. వీరిలో అధికులు వెనుకబడిన కులాలకు చెందిన పేదలు. సెంటు సాగు భూమి లేని గ్రామీణ కుటుంబాలు ఏడు కోట్లకు పైగా ఉన్నాయి. వీరిలో అత్యధికులు దళితులు, మైనారిటీలు, గిరిజనులు. వ్యవసాయ రంగం మీద ఆధారపడిన కోట్ల కుటుంబాలు నిత్యం అప్పుల్లో ఉండడానికి, పేదరికంలో మగ్గుతుండడానికి ప్రధాన కారణం తగినంత సాగు భూమి నిజమైన సాగుదార్ల వద్ద లేకపోవడం. శాస్త్ర, సాంకేతికత పెరిగే కొద్ది గ్రామీణ వృత్తులు అంతరించి వాటిపై ఆధారపడిన వారు వ్యవసాయానికి అదనపు భారమయ్యారు. ప్రభుత్వాల నుండి రైతులకు అందాల్సిన రుణ పరపతి, ఎరువులు, విత్తనాల సబ్సిడీ తగ్గిపోవడం, పంటలకు గిట్టుబాటు ధరలు అమలు కాకపోవడంతో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలోకి వెళ్ళి గ్రామీణ జీవితం ఛిద్రమయ్యింది.

వ్యవసాయాన్ని ముంచే మోడీ విధానాలు

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి మోడీ ప్రభుత్వం 2020 జూన్ 5న ఆర్డినెన్స్ ద్వారా మూడు నల్ల వ్యవసాయ చట్టాలు తెచ్చింది. ఈ ఆర్డినెన్స్‌ను చట్టాలుగా మార్చుకునేందుకు అదే సంవత్సరం సెప్టెంబర్ 17-19 తేదీల మధ్య లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందారు. వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య చట్టం, రైతు ధరల హామీ, వ్యవసాయ సేవల ఒప్పంద చట్టం, నిత్యావసర సరుకుల (సవరణ) చట్టం వల్ల వ్యవసాయంపై తీవ్రమైన దుష్ఫలితాలు కలుగుతాయి. ముఖ్యంగా పంటల ఉత్పత్తుల ధరలను ప్రభుత్వాలు కాకుండా పెద్ద కంపెనీలు నిర్ణయిస్తాయి. దేశ ప్రజల అవసరాల కోసం పంటల సాగు కాకుండా, ఈ కంపెనీలకు ఏది లాభమో దానినే ఉత్పత్తి చేయించగలరు. ఇప్పటి వరకు పేదలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందుతున్న కొద్దిపాటి ఆహారధాన్యాలు కూడా దూరమవుతాయి. ప్రభుత్వాలు ఎరువులు, విత్తనాల మీద ఇస్తున్న సబ్సిడీలను పూర్తిగా తొలగిస్తాయి. వ్యవసాయ రంగంలో నూతన పరిశోధనల నుండి ప్రభుత్వం తప్పుకుంటుంది. జాతీయ బ్యాంకుల నుండి రైతులకు అందుతున్న అరకొర రుణ సదుపాయం కూడా అందక పంటల పెట్టుబడికి, రైతు కుటుంబ అవసరాలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడాల్సి వస్తుంది. వీటన్నింటివల్ల పేద, దిగువ మధ్య తరగతి రైతులు తమకున్న కొద్దిపాటి భూమిని కోల్పోయి భూమి లేని నిరుపేదల్లో చేరిపోతారు. ముఖ్యంగా ఎం.ఎస్.స్వామినాథన్ సిఫారస్సు చేసిన మొత్తం ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలన్న కీలక అంశం అమలుకు నోచుకునే అవకాశమే లేదు.

కనీస మద్దతు ధర ఎందుకు?

అన్ని పంటలకు కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించి అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే 23 పంటలకు మాత్రమే ఈ మద్దతు ధర ప్రకటించబడుతుంది. అందులో 20 పంటలు ఆహారానికి సంబంధించినవి. ఇందులో వరి, గోధుమ, జొన్న లాంటి ఏడు ముతక ధాన్యాలు, ఆరు పప్పుధాన్యాలు, ఏడు నూనెగింజల పంటలు ఉన్నాయి. వాస్తవంగా వరి, గోధుమ పంటలకు మాత్రమే కొద్దిమేర ఈ కనీస మద్దతు ధర అమలవుతుంది. ఈ రెండు పంటల సేకరణలో 65 శాతం పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుండే జరుగుతుంది. ఈ రాష్ట్రాల్లో వ్యవసాయం వృద్ధి చెందడానికి వరి, గోధుమ పంటలకు మద్దతు ధర లభించడం ఒక కారణం. పంజాబ్‌లో వరి పంట అమ్మకాలు 78 శాతం, హర్యానాలో 90 శాతం చిన్న, సన్నకారు రైతుల నుండి జరుగుతున్నాయి. అందుకే మోడీ నల్ల చట్టాల ప్రభావం దేశంలో ఇతర రాష్ట్రాల కంటే ఇక్కడే ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ రెండు రాష్ట్రాల రైతులు కేంద్రం పెట్టే అన్ని నిర్బంధాలను ఎదుర్కొని ఉద్యమిస్తున్నారు.

2000 నుండి 2014 వరకు దేశవ్యాప్తంగా 45 శాతం మంది మధ్య తరగతి రైతులు వ్యవసాయాన్ని వదిలి పెట్టినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తల అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఈ చట్టాలు అమలైతే దేశంలో, మన లాంటి రాష్ట్రాల్లో రైతు వ్యవసాయం కనుమరుగవుతుంది. దీనివల్ల పట్టణాల్లో పనులకు పోటీ పెరిగి వేతనాలు తగ్గడం, ఆకలి చావులు, ఆహారధాన్యాల కొరత తీవ్రమవుతాయి. అందుకే ఢిల్లీలో జరుగుతున్న రైతుల ఉద్యమం దేశ ప్రజల బతుకు కోసం సాగుతున్న ఉద్యమం.

నీరో చక్రవర్తిలా మోడీ

చరిత్రలో రోమ్‌ను పాలించిన నీరో చక్రవర్తి అనగానే 'రోమ్ నగరం తగలబడిపోతుంటే ఫిడేల్ వాయించిన వ్యక్తిగా' గుర్తుకు వస్తాడు. అది చరిత్ర. వర్తమానంలో ఢిల్లీ చుట్టూ వేలాది రైతులు రెండు వారాలుగా ఆందోళన చేస్తుంటే ద్వారకలో డైవింగ్ చేసిన, తిరువనంతపురంలో గగన్‌యాన్ అంతరిక్ష మిషన్ ముందు మోకరిల్లిన మన ప్రధానిని చూసి తరించే భాగ్యం దేశ ప్రజలకు పట్టుకుంది. గత 45 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిపోయిందని 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా-2023' నివేదిక ప్రకటించిన, గత 11 సంవత్సరాల్లో కుటుంబ ఖర్చులు ఎన్నడూ లేనంతగా భారీగా పెరిగిపోయాయని, అందుకు అనుగుణంగా ప్రజల ఆదాయం పెరగలేదని హెచ్‌సిఇఎస్ తాజా నివేదిక బట్టబయలు చేసినప్పటికీ ఏ మాత్రం చలించక, వేషాలు మార్చి మార్చి దేశ ప్రజలకు దర్శన భాగ్యం కల్గించగల నేర్పరి మన ప్రధాని. కొద్దిమంది దేశీయ, విదేశీ సంపన్నుల కోసం కోట్లమంది సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించకుండా వ్యవసాయాన్ని, దేశాన్ని కాపాడుకోలేం.

- వి. రాంభూపాల్
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

రాజ్యాంగ వ్యతిరేక శక్తుల ఓటమే మేడే కర్తవ్యం

2024 మేడే నాటికి దేశంలో 18వ సాధారణ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే 2 దశల ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో భారతదేశ కార్మిక, శ్రామిక వర్గం కీలకమైన బాధ్యతను నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. గత దశాబ్ద కాలంగా దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్రమోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంపై, రాజ్యాంగ మౌలిక స్వరూపంపై, రాజ్యాంగ వ్యవస్థపై దాడి చేసింది. ఆర్థిక రంగంలో పెద్దఎత్తున ప్రైవేటీకరణ చేస్తూ కార్మిక హక్కులను కాలరాసింది. ప్రజలలో మత పరమైన విభజన తేవడానికి మతతత్వాన్ని రెచ్చగొట్టే కార్యక్రమాలను చేపట్టింది. నిరంకుశ విధానాలను అవలంభిస్తూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నది. 18వ లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చి వేస్తామని, లౌకిక వాదాన్ని తొలగిస్తామని బిజెపి ఎంపిలు బాహాటంగా ప్రకటిస్తున్నారు. ఇటీవల ప్రధానమంత్రి ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ 'గత పదేళ్లుగా చూసినది ట్రైలర్ మాత్రమే, రాబోయే ఐదేళ్లలో అసలు సినిమా చూపిస్తాం' అనడం గమనార్హం. ఈ అంశాలను దేశవ్యాపితంగా కార్మికులు, ఉద్యోగులు గమనించాల్సిన అవసరం ఉంది.

రాజ్యాంగ మౌలికాంశాలపై దాడి

గత పదేళ్లుగా భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంలో గల ఫెడరలిజం, లౌకికవాదం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలపై మోడీ ప్రభుత్వం దాడి చేసింది. రాష్ట్రాల హక్కులను హరించింది. జిఎస్‌టి ద్వారా రాష్ట్రాలకు 3 లక్షల కోట్లు నష్టం చేసింది. పెద్ద నోట్లు రద్దు చేసింది. ఫెడరలిజానికి వ్యతిరేకంగా రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేసింది. మోడి ప్రభుత్వం చేసిన 3 వ్యవసాయ చట్టాలు రాజ్యాంగ విరుద్ధం. లక్షలాది మంది రైతుల ఆందోళన తరువాత ఈ చట్టాలను ఉపసంహరించుకున్నది. రాష్ట్రాలతో సంప్రదించకుండానే నూతన జాతీయ విద్యావిధానం -2020 ప్రకటించింది. 2029లో జమిలి ఎన్నికలు ప్రవేశ పెట్టడానికి మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2029 నాటికి రాజ్యాంగ సవరణ చేసి జమిలి ఎన్నికలు ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది. ఫెడరలిజంలో భిన్నమైన రాజకీయ పార్టీలు కేంద్రం, రాష్ట్రాల్లో అధికారంలో ఉండవచ్చు. కానీ మోడీ ప్రభుత్వం రాష్ట్రాలలో తమకు నచ్చని ప్రభుత్వాలను కూలదోయడానికి అప్రజాస్వామిక చర్యలు చేపట్టింది. ఢిల్లీ, జార్ఖండ్ ముఖ్యమంత్రులను అరెస్ట్ చేసి జైలులో ఉంచడమే దీనికి ఉదాహరణ. తమిళనాడు, కేరళ, కర్నాటక ప్రభుత్వాలను గవర్నర్ల ద్వారా ఇబ్బందులకు గురిచేస్తున్నది. జాతీయ ఎన్నికల కమిషన్‌లో తమకు నచ్చిన వారిని నియమించే విధంగా రాజ్యాంగ సవరణలు చేసింది. దీని వలన ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పని చేయడం లేదు. కొలీజియం ద్వారా జరిగే సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలలో జోక్యం చేసుకుని న్యాయవ్యవస్థపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నది.

ఆర్థిక రంగం - కార్మిక హక్కులు

ఆర్థిక రంగంలో పెద్దఎత్తున ప్రైవేటీకరణ చేపట్టింది. లాభాలతో నడుస్తున్న పరిశ్రమలను కూడా ప్రైవేటీకరిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ఎన్నో త్యాగాలతో ఏర్పడింది. 32 మంది ఈ కర్మాగారం కోసం ప్రాణ త్యాగం చేశారు. ఇప్పుడు ఈ కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తున్నారు. 'క్రోనీ కాపిటలిజం' విధానాల ద్వారా గౌతమ్ అదాని, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలకు పూర్తి లబ్ధి చేకూర్చారు. పెద్ద పారిశ్రామిక కంపెనీలకు 15 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యింది. దేశంలో కార్మికవర్గం అనేక చారిత్రక పోరాటాలు చేసి హక్కులను, కార్మిక చట్టాలను సాధించుకున్నది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లు ప్రవేశపెట్టి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసింది. ఉద్యోగులకు, కార్మికులకు పెన్షన్ లేకుండా చేసిన 2004 జాతీయ పెన్షన్ పథకం, సిపిఎస్ పథకం రద్దు చేయాలని దేశవ్యాపితంగా కోరుతున్నా కేంద్రం స్పందించలేదు. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, చత్తీస్‌ఘడ్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలు సిపిఎస్ విధానాన్ని రద్దు చేశాయి. కార్మికులు, ఉద్యోగులు గతంలో ఢిల్లీలో జంతరమంతర్ వద్ద అనేక ఆందోళనలు చేసేవారు. గత 5 ఏళ్ళుగా ఆందోళనలను నిరంకుశంగా అణిచి వేస్తున్నారు.

మతతత్వం ధోరణులు..

భారత రాజ్యాంగం లౌకిక విధానాన్ని, మత స్వేచ్ఛను ఇచ్చింది. భిన్నమతాలు గల భారతదేశంలో ప్రజలు లౌకికవాదం, మతసామరస్యంతో జీవించాలని రాజ్యాంగం చెప్పింది. కానీ బిజెపి ప్రభుత్వం సంఘపరివార్ సిద్ధాంతుల ఆధారంగా దేశంలో హిందుత్వ, మతతత్వ విధానాలు అనుసరిస్తున్నది. హిందువులు - ముస్లింల మధ్య మతపరమైన విద్వేషాలు రెచ్చగొడుతున్నది. ప్రధాన మంత్రి స్వయంగా ఎన్నికల సభల్లో ద్వేష పూరితమైన ప్రసంగాలు చేశారు. జమ్మూకాశ్మీర్ రాష్ట్రానికి 370వ నిబంధన రద్దుచేసి, రాష్ట్ర ప్రతిపత్తి కూడా లేకుండా చేశారు. గోరక్షక దళాల పేరుతో మైనారిటీలు, దళితులపై అనేక చోట్ల దాడులు చేశారు. మార్చి 11న సిఎఎ చట్టం- పౌరసత్వ సవరణ చట్టం అమలుకు నోటిఫికేషన్, విధి విధానాలు విడుదల చేశారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా తీవ్రమైన ఆందోళనలు జరిగాయి. ముస్లిం మైనారిటీలు సిఎఎ, ఎన్‌పిఆర్‌ల పట్ల భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హోం మంత్రి అమిత్‌షా ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బహాటంగా ప్రకటించారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులలో 29, 30 నిబంధలు మైనార్టీల భాష, విద్యా, సంస్కృతి అభివృద్ధికి అనేక హక్కులు ఉన్నాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పుడు ఆ హక్కులన్నింటినీ రద్దు చేస్తున్నది. రాబోయే కాలంలో 'ఏకపౌరస్మృతి' ప్రవేశ పెట్టాలని ప్రయత్నిస్తున్నది. భారత దేశంలో బిజెపి ఆధ్వర్యంలో పెరుగుతున్న మతతత్వ ధోరణులు జాతీయ సమైక్యతకు, ప్రజల సమైక్యతకు, ముఖ్యంగా కార్మిక సమైక్యతకు ప్రమాదకరం.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం..

భారత దేశ మౌలిక లక్షణమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ సాంప్రదాయాలను పాటించడం లేదు. ప్రధాన మంత్రి పార్లమెంట్ సమావేశాలకు హాజరు కావడం లేదు. బిల్లులను చర్చలేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదిస్తున్నారు. బిల్లులను స్టాండింగ్ కమిటీలు, సెలక్ట్ కమిటీలకు పంపే సంప్రదదాయాలను వదిలివేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ, ఇన్‌ఖంటాక్స్, ఎన్ఐఎ మొదలైన వాటి ద్వారా తమకు నచ్చని వారిని, మాటవినని వారిని వేధిస్తున్నారు. రాజ్యాంగం ఇచ్చిన 'భావ ప్రకటనా స్వేచ్ఛ' ను హరిస్తున్నారు. బిల్కిస్ బానో కేసులో కోర్టులో నిందితులను కాపాడటానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. అదే సమయంలో ప్రొఫెసర్ సాయిబాబా, వరవరరావు మొదలైన వారికి బెయిల్ రాకుండా ఉండటానికి ప్రయత్నాలు చేశారు.

ఈ మేడే సందర్భంగా కార్మికవర్గంపై ప్రత్యేక బాధ్యతతో తమ కర్తవ్యాన్ని నిర్వహించాలి. 3వ సారి ప్రధానమంత్రి కావాలని తహతహలాడుతున్న నరేంద్రమోడిని, బిజెపిని, మతతత్వ శక్తులను ఓడించాలి. దేశ వ్యాపితంగా జరుగుతున్న ఎన్నికల్లో బిజెపిని, ఎన్‌డిఎ కూటమిని ఓడించాలి. లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను గెలిపించుకోవాలి. దీని కోసం 'ఇండియా' వేదిక అభ్యర్థులను గెలిపించుకోవడానికి కార్మికవర్గం ప్రత్యేకమైన కృషి జరపాలి. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను కాపాడుకోవడానికి, లౌకికవాదం, ఫెడరలిజం సంరక్షించుకోవడానికి, ప్రజాస్వామ్యాన్ని కొనసాగించుకోవడానికి ఈ ఎన్నికలల్లో కార్మికవర్గం చైతన్యవంతమైన పాత్ర నిర్వహించాలి.

- కె.ఎస్.లక్ష్మణరావు,
శాసన మండలి సభ్యులు

సమాజ సేవలో డాక్టర్ నిరీక్షణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

సమాజ సేవే లక్ష్యంగా ప్రజలకు అతి తక్కువకాలంలో చేరువయ్యే కొందరిలో డాక్టర్ నిరీక్షణరాజు ఒకరు. కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన డాక్టర్ నిరీక్షణరాజు స్వతహాగా మృదుస్వభావి. గత 16 ఏళ్లుగా ఆక్వా రంగంలో లేబర్ కాంట్రాక్టర్‌గా, వివిధ వ్యాపారాల్లో రాణిస్తూ ఉన్నత స్థితికి ఎదిగారు. తన సంపాదనలో కొంతైనా సామాజిక సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెచ్చించాలని దృక్పథంతో ఆక్వా కార్మికులకు, పేదలకు తనవంతు సాయం చేస్తున్నారు. పరులకు ఉప కారం చేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటారు. ప్రచారానికి దూరంగా.. ప్రజలకు దగ్గరగా ఉంటారు. 'సమాజానికి మేలు చేసేవాళ్లు.. కనిపించాల్సిన పని లేదు.. తాను చేసే సేవ కనిపిస్తే చాలు' అంటారు డాక్టర్ నిరీక్షణరాజు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతకు బహుమతి అందిస్తున్న నిరీక్షణరాజు

ఆరేళ్లుగా సేవలు

సమాజ సేవే లక్ష్యంగా నిరీక్షణరాజు పేదలకు ఆర్థిక సాయం అందించడంలో ముందుంటున్నారు. సమాజం ఎంతో ఇచ్చింది.. అలాంటి సమాజానికి ఎంతోకొంత ఇవ్వాలని ఆకాంక్షించే ధోరణి వారిది. ఎన్నో సేవా కార్యక్రమాలే అందుకు ఉదాహరణ. గడిచిన అరేళ్ళుగా వారు చేపట్టిన కార్యక్రమాలు పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కల్గిస్తున్నాయి. పది మందికి సాయ పడాలనే డాక్టర్ నిరీక్షణరాజు ధోరణి. నిజానికి పెద్దల మార్గదర్శకత్వంలో వీరు ఈ మార్గంలోకి వచ్చారు. తాము ఎదుగుతున్నకొద్దీ మరికొందరికి మంచిమార్గం చూపాలనేది వారి లక్ష్యం. వారి సేవా భావనకు అద్దం పడుతుంటాయి.

ఆపదలో అండగా..

వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆమెకు సామాన్య ప్రజలు పడే కష్టాలను చాలాబాగా అర్థం చేసుకోగలరు. అందుకోసమే తనవంతు సాయంగా ప్రజలకు ఇదొక విధంగా సాయపడాలనే సదుద్దేశంతో పరులకు ఉపకారం చేస్తున్నారు. వందల మంది ఆకలి తీర్చడమే కాకుండా, ఆర్థిక సాయం అందించారు. ఆక్వా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కరోనా మొదటి, రెండు దశల్లో వందలాది మందికి లక్షలాది రూపాయల విలువైన కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారు నిరీక్షణరాజు. కరోనా, లాక్‌డౌన్ కారణంగా ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న వందలాది ఆక్వా కార్మికుల కుటుంబాలకు, పలు గ్రామాల్లో పేదలకు ఆర్థిక సహకారం అందించారు.

వివిధ రంగాల్లో..!

సమాజ సేవలో గత ఆరేళ్లుగా సామాజిక, విద్య, క్రీడ రంగాల్లో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడం దేశ నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించి పేదలకు ఆర్థిక సాయం చేశారు. అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోపల్లె గ్రామంలో అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ప్రతియేటా పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలు 2022లో ఘనంగా నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. 2023లో బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతియేటా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

నిరీక్షణరాజు సేవలను గుర్తించి రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ పురస్కారాన్ని గతేడాది అందించింది.

ఆర్భాటాలు తగ్గించుకోవాలి
డాక్టర్ నిరీక్షణరాజు, కోపల్లె

నిజమైన సంతోషం సేవలోనే ఉంది. మన ఖర్చులు, వేడుకల ఆర్భాటాలు కొంత తగ్గించుకుంటే నిరుపేదల కష్టాలను కొంతైనా తీర్చగలుగుతాం. మేం ఈ విషయాన్ని అందరికీ తెలియజేస్తున్నాం. మనచుట్టూ ఉన్న మనుషుల కష్టాలను పట్టించుకోవాల్సిన అవసరం అందరిపై ఉంది. సంపాదించిన దాంట్లో కొంత సామాజిక సేవకు నిరంతరం కొనసాగించాలన్నదే నా ఆకాంక్ష. భీమవరం, ఇతర ప్రాంతాల్లో పని చేసే ఆక్వా కార్మికులకు, పేదలకు నా వంతు ఆర్థిక సహకారం అందిస్తున్నాను. ఎన్ని కష్టాలు ఎదురైనా నిర్విరామంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాను.

అంగన్‌వాడీల విజయ గీతిక

2023 డిసెంబరు 12 నుండి 42 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేసిన నిరవధిక సమ్మె పోరాటం చారిత్రాత్మక విజయం సాధించింది. లక్షా 5 వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, మినీ వర్కర్లు పట్టుదలగా ఉద్యమాన్ని నడిపారు. దశలవారీగా రోజు రోజుకు పోరాటాన్ని ఉధృతం చేసి రాష్ట్ర బంద్ పిలుపునకు కూడా సిద్ధమయ్యారు. 24 గంటల దీక్షలు చేశారు. నాయకత్వం నిరవధిక దీక్షలకు దిగింది. అన్ని రకాల పోరాటాలతో ఎన్ని రోజులైనా కొనసాగించాలని నిర్ణయించారు. అంగన్‌వాడీల అకుంఠిత దీక్ష, పట్టుదల ఈ పోరాట విజయానికి కీలకం. పైగా లబ్ధిదారుల, ప్రజల మద్దతు విస్తృతంగా లభించింది. ఇదే కాలంలో రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు 16 రోజులపాటు సమరశీల పోరాటం నడిపారు. వారి పట్టుదలకు రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి ఒప్పందం చేసింది. అంతేగాక, ఈ కాలంలో ఎస్ఎస్ఎ కార్మికుల సమరశీల పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి వారితో ఒప్పందం చేయవలసి వచ్చింది. పోరాటాలే సమస్యల పరిష్కారానికి మార్గమని మరోమారు నిరూపితమైంది.

జనవరి 22 ఒప్పందం జరిగే రోజు వరకూ పోలీసుల జోక్యం లేకుండా జాగ్రత్త పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేస్తే అంగన్‌వాడీలు మరింతగా తిరగబడతారని ప్రభుత్వానికి తెలుసు. జగనన్నకు కోటి సంతకాలు సమర్పించడాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్యమం తారస్థాయికి చేరింది. ప్రభుత్వం దిగి వచ్చింది. అన్ని క్రమశిక్షణా చర్యలూ ఆగిపోయాయి. షోకాజ్‌లు, టెర్మినేషన్లు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. పోలీస్ కేసులు ఎత్తివేస్తామని కూడా ప్రభుత్వం హామీ ఇచ్చింది. డిమాండ్లు సాధించారు. మైలవరంలో పోలీసు కేసుల్లో ఉన్న అంగన్‌వాడీలతో సహా రాష్ట్రమంతటా అంగన్‌వాడీలు డ్యూటీలో చేరారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో జరిగిన అంగన్‌వాడీల పోరాటాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన విజయం సాధించారని అఖిల భారత అంగన్‌వాడీ నాయకులు ఎ.ఆర్.సింధు కొనియాడారు.అంగన్‌వాడీలు ఎన్ని రోజులు పోరాడతారో చూద్దామని ఆరు సార్లు చర్చలు జరుపుతూ జాప్యం చేసే ఎత్తుగడ చేపట్టింది రాష్ట్ర ప్రభుత్వం. ఆదర్శప్రాయమైన ఈ పోరాటాన్ని అభినందించాలి.

కార్మికులు ఏం సాధించారు ?

సమ్మె ప్రారంభించినప్పటి నుంచీ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు 'డబ్బులు పెంచం' అని జనవరి 22 వరకూ ఒకే మొండి వైఖరి తీసుకున్నది. పోరాట ఫలితంగా మెరుగైన వేతనాన్ని యూనియన్‌లతో చర్చించి 2024 జులై నుంచి అమలు జరుపుతామని జనవరి 22వ తేదీ రాత్రి జరిగిన చర్చల్లో ప్రభుత్వం అంగీకరించడం ఈ పోరాట విజయంలో కీలకం. లక్ష మంది అంగన్‌వాడీలకు జీతాలు పెంచితే మరో 2 లక్షల మంది స్కీమ్ కార్మికులకు పెంచవలసి వస్తుందని ప్రభుత్వ వాదన. వేతనాల పెంపు ఒప్పందంలో అంకెలు కానరావు. కానీ ఈ ఒప్పందం వల్ల ఏ ప్రభుత్వం అయినా యూనియన్లతో తప్పక చర్చించి 2024 జులై నుండి వేతనాలు పెంచాలి.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. రిటైర్‌మెంట్ తరువాత వర్కర్‌కు ఇచ్చే గ్రాట్యూటీ తక్షణం రూ.1.20 లక్షలు (తెలంగాణలో రూ.లక్ష), ఆయాకు రూ.60 వేలు (తెలంగాణలో రూ.50 వేలు) ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రాట్యూటీ చెల్లించడానికి అనుకూలంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్స్ చేస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో చట్ట ప్రకారం మిగిలిన సుమారు రూ.50 వేలు కూడా పెంచుతామని అంగీకరించారు.

రాష్ట్రంలో 5,600 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మినీ అంగన్‌వాడీలను 'మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు'గా మార్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయి. ఇది 30 సంవత్సరాల డిమాండ్. జనాభా పెరిగినా మినీ సెంటర్లను ఇప్పటి వరకూ మార్చలేదు. ఇప్పుడు మినీ వర్కర్లుగా ఉన్న వారందరూ వర్కర్లుగా మారతారు. వారి జీతం నెలకు రూ.7 వేల నుండి నేరుగా రూ.11,500కు పెరుగుతుంది. జులై నుండి పెరిగే జీతం కూడా వారికి అదనంగా వస్తుంది. సుమారు 5 వేల మంది కొత్త వారికి ఆయాలుగా ఉద్యోగాలు వస్తాయి. ఇది మంచి విజయం.

అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, మినీ వర్కర్లందరికీ రిటైర్‌మెంట్ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలుగా మారుతుంది. అంగన్‌వాడీలందరికీ 2 సంవత్సరాలు అదనంగా పని చేసే హక్కు లభించడంతోపాటు జీతాలు పెరగడంవలన వారి జీవితాలు ఎంతో కొంత మెరుగవుతాయి.

అంగన్‌వాడీ హెల్పర్ల ప్రమోషన్ వయస్సు 45 నుండి 50 సంవత్సరాలకు పెంచడానికి జీవో ఇచ్చింది. ఇప్పటి వరకూ ఆయాల ప్రమోషన్‌కు వయస్సు అడ్డం వచ్చేది. ఇప్పుడు ఆ సమస్యను పరిష్కరించుకున్నారు.

అంగన్‌వాడీ వర్కర్లు ప్రతి నెలా ప్రాజెక్టు మీటింగ్‌లకు వెళ్లడానికి ప్రయాణ ఖర్చులు 2017 నుండి ప్రభుత్వాలు ఎగ్గొట్టాయి. ఇప్పటి నుండి చెల్లించడానికి జీవో వచ్చింది. గతంలో లేనిది ఆయాలకు రెండు నెలలకు ఒకసారి మీటింగ్‌లకు వెళ్లడానికి రవాణా చార్జీలు ఇవ్వడానికి కూడా జీవో ఇచ్చింది. పాత బాకీలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

సర్వీస్‌లో చనిపోయిన అంగన్‌వాడీల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. సర్వీస్‌లో మరణించిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా అమలు చేస్తారు. చనిపోయిన వారి కుటుంబాలకు దహన (మట్టి) ఖర్చులు సాధించుకున్నారు.

నాలుగు యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్చి నెల నుండి అమల్లోకి తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలనే డిమాండ్‌పై వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు, మెనూ పెంపు, గ్యాస్ తదితర సమస్యల పరిష్కారానికి కమిటీ వేశారు. కమిటీ సిఫార్సుల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

సమరశీల పోరాటాలు జరిగిన చోట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీతాలు చెల్లించడానికి మొండిగా నిరాకరిస్తున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్, టీటీడీ కార్మికులతో సహా సమ్మె కాలంలో జీతాలు కోల్పోయినప్పటికీ కార్మికులు త్యాగం చేసి పోరాటాలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కార్మికులు సమ్మె కాలపు జీతాలు సాధించడం మంచి విజయం. రాష్ట్రంలోని కార్మిక వర్గం అంగన్‌వాడీల పోరాటానికి మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 9, 20న అన్ని జిల్లాల్లో రాస్తారోకోలు చేశారు. జాతీయ రహదారిపై బైఠాయింపులు చేపట్టారు. నిరసనలు తెలిపారు. నిధులు వసూలు చేసి అపూర్వ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం దిగివచ్చిన తరువాత సకాలంలో పోరాటాన్ని ముగించారు. అంగన్‌వాడీలు గత రెండేళ్లలో హర్యానా, ఢిల్లీ, బీహార్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో మంచి పోరాటాలను నడిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్మా ప్రయోగించినా ఎదిరించి విజయం సాధించేవరకు ధైర్యంగా పోరాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌జీఓలకు పీఆర్‌సీలో కోత వేసింది. విద్యుత్ ఉద్యోగులను దగా చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేస్తామన్న మాట తప్పింది. ఇటువంటి పరిస్థితుల్లో అంగన్‌వాడీలు సాధించుకున్న విజయం సాపేక్షంగా మెరుగైనది. అంగన్‌వాడీ పోరాట అనుభవాలను యావత్తు కార్మికవర్గం ఆదర్శంగా తీసుకోవాలి.

- సిహెచ్. నరసింగరావు,
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రపంచ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ

ప్రపంచ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని సిపిఎం మండల నాయకులు నాగిశెట్టి గంగారావు, ఆవుల శ్రీను అన్నారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మేడే సందర్భంగా బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు పంచాయతీ పార్కు వద్ద నుంచి సిపిఎం స్థూపం వరకు ప్రదర్శన జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి గంగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాపీమేస్త్రీ వర్కర్లు, బిల్డింగ్ వర్కర్లు, ఐరన్, ట్రాక్టర్, పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా, మిడ్‌డే మీల్స్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మున్సిపల్ కార్మికుల పోరాట విజయం

ఉద్యోగాల పర్మినెంట్, సమాన పనికి సమాన జీతం సాధన కోసం పోలీసు నిర్బంధం, అధికార పార్టీ నాయకుల దాడులు, దౌర్జన్యాలు, అధికారుల బెదిరింపులు, పోటీ కార్మికులను ఎదుర్కొని మున్సిపల్ కార్మికులు పోరాడి విజయం సాధించారు. 16 రోజుల సమ్మెకు మద్దతునిచ్చి బలపరిచిన కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, అన్ని వర్గాల ప్రజలకు, మీడియా మిత్రులకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలియజేసింది.

మునిసిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం డిసెంబరు 26 నుంచి జనవరి 10 వరకు 16 రోజులు పాటు సమ్మె జరిగింది. అంతకుముందే ప్రారంభమైన అంగన్‌వాడి ఉద్యోగులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలతో మున్సిపల్ కార్మికుల సమ్మె తోడు కావడంతో ఒక్కసారిగా రాజకీయ రంగంలో పెద్ద మార్పు సంభవించింది. అప్పటి వరకు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న రాజకీయ పార్టీలు కార్మికుల సమ్మె వైపు మరలాల్సి వచ్చింది.

సమ్మె డిమాండ్లు

ముఖ్యమంత్రి హామీ ప్రకారం ఔట్‌సోర్సింగ్ కార్మికుల పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం, ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్స్, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం, పర్మినెంట్ వారికి సరెండర్ లీవ్‌లు, జీపీఎఫ్ అకౌంట్లు, తదితర డిమాండ్ల సాధన కోసం ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకత్వాన 2023 డిసెంబర్ 26 నుండి 2024 జనవరి 10వ తేదీ వరకు నిరవధిక సమ్మె జరిగింది. ఏఐసిటియు, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి సంఘాలతో పాటు ఏఐటియూసి, వైయస్సార్‌టియుసి కార్మికులు కూడా అనేక చోట్ల సమ్మెలో కలిసి వచ్చారు. ఈ డిమాండ్స్ సాధనకై సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రవ్యాపితంగా రాజీలేని పోరాటాలు నిర్వహించింది. వందల మందికి లాఠీ దెబ్బలు తగిలాయి. పోలీసు కేసులు నమోదయ్యాయి.

సాధించిన విజయాలు

1) సమ్మె పోరాటంతో సమాన పనికి సమాన జీతం. పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న హెల్త్ అలవెన్స్ రూ.6,000ను జీతంలో కలపాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. బేసిక్ రూ.15000, హెల్త్ అలవెన్స్ రూ.6000 కలిపి రూ.21,000 జీతంగా మార్పు

చేయించుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం 11వ పి.ఆర్.సి.లో 4వ తరగతి ఉద్యోగులకు నిర్ణయించిన బేసిక్ రూ.20000 మాత్రమే. ప్రస్తుతం మన కార్మికులకు జీతం కొత్తగా పెరిగినట్టు కనపడకపోయినా రూ. 15,000గా ఉన్న బేసిక్ రూ.21,000కు పెరగటం మంచి విజయం. హెల్త్ అలవెన్స్ ఎప్పుడైనా ఎగిరిపోయే ప్రమాదం ఉంది. రూ. 21,000 జీతంగా మారడం వల్ల జీవితాంతం మనకి మేలు జరుగుతుంది. ఈ ఏడాదిలోపు ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పి.ఆర్.సి ప్రకారం జీతాలు పెరుగుతాయి. భవిష్యత్‌లో రూ.21,000పైనే బేసిక్ పెరుగుతుంది.

2) మలేరియా, పార్కులలో పనిచేసే శానిటరీ వర్కర్, శానిటరీ వెహికల్ క్లీనర్స్ వేతనం రూ.15000 నుండి రూ.21,000కు పెరిగింది. విలీన పంచాయితీలు, నగర పంచాయతీలలో పారిశుధ్య విభాగం కార్మికులకు ప్రస్తుతం 10 వేలు, 12 వేలు మాత్రమే పాత పంచాయితీ జీతాలు ఇస్తున్నారు. వారందరికి రూ.21,000కు జీతం పెరగడంతో పాటు పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ.లు చెల్లిస్తారు. రాష్ట్రంలో కొత్తగా 7 వేల మంది ఈ ప్రయోజనం పొందుతారు.

3) శానిటరీ వెహికల్ డ్రైవర్లకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు 2023 డిసెంబర్ వరకు రూ.18500గా ఉన్న జీతం సమ్మె పోరాటంతో రూ.24,500కు పెరిగింది. ఈ విధంగా 3 వేల మంది కార్మికులు ప్రయోజనం పొందుతున్నారు.

4) 16 రోజుల సమ్మె పోరాటం గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌ను, అధికారులను కదిలించి ఇంజినీరింగ్ కార్మికులకు, స్కిల్డ్, సెమీస్కిల్డ్ జీతాల చెల్లింపునకు, కేటగిరీల నిర్ధారణ, జీతాల పెంపుదలకు 9 మంది అధికారులతో కమిటి ఏర్పాటు చేసి జనవరి 10వ తేదీనే పేర్లతో సహా కమిటీని ప్రకటించింది. జనవరి 17వ తేదీ లోపు ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపైన ఈ కమిటీకి, స్థానిక మున్సిపల్ కమిషనర్లకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జీవో ఆర్.టి నెం: 30 సవరించి కార్మిక శాఖ సిఫార్సుల మేరకు నీటి సరఫరా, చెయిన్ దళం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు తదితరులకు జీతాలు పెంపునకు ప్రభుత్వం అంగీకరించింది.

5) మొదటిసారి రిటైర్మెంట్ బెనిఫిట్ సాధించుకున్నాం. 2024 జనవరి నుండి రిటైర్ అయ్యే ఆప్కాస్ కార్మికులందరికి రూ.75,000 చెల్లిస్తారు. రాష్ట్రంలో 48 వేల మంది ప్రయోజనం పొందుతారు.

6) జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 25 ప్రకారం రాష్ట్రంలో 2019 నుండి 2023 చివరి నాటికి దాదాపు 400 మంది సర్వీసులో ఉండగా చనిపోయారు. వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు. పనిచేస్తూ ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియో కింద 5 లక్షల రూపాయలు చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు కోట్ల రూపాయలు ఈ విధంగా మన కార్మికుల కుటుంబాలకు అందించారు. ఇప్పటి వరకు ప్రమాద మరణానికి చెల్లిస్తున్న 5 లక్షలను 7 లక్షల రూపాయలకు పెంచారు.

7) పండుగ బహుమతి మనిషికి రూ.1,000 కొత్తగా సాధించుకున్నాం. 4 కోట్ల 87 లక్షల రూపాయలు రాష్ట్రంలో 48,700 మంది కార్మికులు ప్రయోజనం పొందుతారు.

8) సర్వీసులో ఉండగా చనిపోయిన కార్మికుల దహన సంస్కారాల ఖర్చులు రూ.15,000 నుండి రూ.20,000కు పెంచారు.

9) జనవరి నెలాఖరులోపు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి, కాంట్రాక్టర్లు, మున్సిపల్ యూనియన్ నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి క్లాప్ ఆటో డ్రైవర్లకు చట్టబద్ధమైన జీత, భత్యాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం అంగీకరించింది.

10) 16 రోజుల సమ్మె పోరాటం ఫలితంగా స్కూల్ స్వీపర్లు (కంటింజెంట్ వర్కర్లు) జీతాలు మున్సిపాలిటీలే చెల్లిస్తాయి. మళ్లీ అధికారంలోకి వచ్చాక 23% చొప్పున జీతాలు పెంచుతామని ప్రభుత్వం అంగీకరించింది.

11) పర్మినెంట్ సిబ్బందికి బకాయి సరెండర్ లీవులు చెల్లింపు, జి.పి.ఎఫ్. ఖాతాలు తెరిపించేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 10 వేల మంది ప్రయోజనం పొందుతారు.

12) 16 రోజుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లిస్తారు. పోలీసు కేసులు ఎత్తివేస్తారు.

పోరాట అనుభవాలు

సమాన పనికి సమాన జీతం, ఉద్యోగాల పర్మినెంట్ డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ రంగంలోని అత్యధిక మంది కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఇంజినీరింగ్ కార్మికులలో ఇంకా రావలసినంత కదలిక రాలేదు. ఇతర సంఘాలు తొలి నుండి సమ్మె పోరాటంలో ఐక్య కార్యాచరణకు సిద్ధం కాకపోవటం వంటి బలహీనతలు ఉన్నప్పటికీ 16 రోజుల సమ్మె పోరాటం కార్మికుల చైతన్యాన్ని పెంచడానికి తోడ్పడింది. రేయింబవళ్లు కార్మికులు గస్తీ తిరుగుతూ అధికార పార్టీ నాయకులు, అధికారులు, పోలీసు నిర్బంధం, పోటీ కార్మికులను ఎదుర్కొని మిలిటెంట్ పోరాటం నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా మహిళా కార్మికుల పాత్ర ప్రశంసనీయమైంది. ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి, దుర్గంధభరితంగా మారినప్పటికీ పట్టణ ప్రజానీకం మున్సిపల్ కార్మికుల పోరాటానికి మద్దతు ప్రకటించటం అభినందనీయం. కార్మికులంతా ఐక్యంగా పోరాడితే మరిన్ని విజయాలు సాధించగలమని ఈ పోరాటం రుజువు చేసింది. సాధించిన విజయాలతోపాటు పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోంది. పై అంశాలన్నీ సమ్మె విరమణ సందర్భంగా ప్రభుత్వం కార్మిక సంఘాలతో జరిగిన చర్చల్లో అంగీకరించినవి. వీటికి మినిట్స్ ఇచ్చారు. పండుగ కానుక వెయ్యి రూపాయల చెల్లింపునకు జీఓ ఇచ్చారు. మిగిలిన వాటికి జి.ఓ.లు రావాల్సి ఉంది.

- కె.ఉమామహేశ్వరరావు,
ప్రధాన కార్యదర్శి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ)

సీన్ రివర్స్-బతకడానికి పల్లెబాట

'కూటి కోసం, కూలి కోసం ..పట్టణంలో బతుకుదామని.. తల్లిమాటలు చెవిన పెట్టక... బయలుదేరిన బాటసారికి..' అంటూ మహాకవి శ్రీశ్రీ రాసిన కవిత గుర్తుంది కదూ! ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. పాలకుల విధానాల పుణ్యమా అని బస్తీలు బతుకు నివ్వడం మానేశాయి. దీంతో పొట్ట చేతపట్టుకుని పల్లె బాట పడుతున్న వారి సంఖ్య ఏటికేడాది పెరుగుతోంది. మూడు సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా 5.6 కోట్ల మంది పట్టణాల నుండి పల్లెలకు చేరారు. ఉపాధి కోసం వ్యవసాయాన్ని ఆశ్రయించారు. ఇది దేశ విభజన సమయంలో జరిగిన వలసల కన్నా ఎక్కువ! ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఓ) ఇటీవల విడుదల చేసిన 'ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్-2024' ఈ విషయాన్ని ధృవీకరించింది. ఐఎల్‌ఓతో పాటు, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్, ఢిల్లీకి చెందిన ఎన్‌జీఓ ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ కలిసి 2020-2022 కాలానికి ఈ నివేదికను రూపొందించాయి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలు, జాతీయ నమూనా సర్వేలు తదితర ప్రభుత్వ గణాంకాలే ఈ నివేదికకు ఆధారంకావడం గమనార్హం.

కరోనాతో ప్రారంభం

మోడీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా కరోనా సమయంలో వలసకార్మికుల సుదీర్ఘ పాదయాత్రలను దేశం చూసింది. నగరాలు, పట్టణాల్లో పట్టించుకునే దిక్కు లేకపోవడంతో కరోనా విజృంభించిన 2020వ సంవత్సరంలో మూడు కోట్ల మందికిపైగా పల్లెలకు చేరినట్లు ఐఎల్‌ఓ నిర్ధారించింది. ఆ ఏడాది వ్యవసాయం, అనుబంధ రంగాల్లో కార్మికుల సంఖ్య 3.80 కోట్ల మంది పెరిగారు. ఆ తరువాత కూడా గ్రామాలకు వలసలు కొనసాగాయి. 2021వ సంవత్సరంలో వ్యయసాయ రంగంలో 1.21 కోట్ల మంది కార్మికులు పెరిగారు. 2022లో 1.29 కోట్ల మంది ఇలా పల్లెలకు చేరారు. అంతకుముందు వృద్ధులతో పాటు యువకులు కూడా వ్యవసాయం నుండి బయటకు వచ్చేవారు. 2000-2019 సంవత్సరాల మధ్య ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు మళ్లీ పల్లెల్లో వ్యవసాయ పనుల్లోకి యువత చేరుతున్నట్లు ఐఎల్‌ఓ తెలిపింది. 'వ్యవసాయ రంగం వెలువల పని అవకాశాలు లేకపోవడం, మహమ్మారి కారణంగా ఆర్థిక మందగమనంలో ప్రజలు వెనక్కి వెడుతున్నారు' అని నివేదికలో పేర్కొన్నారు. వీరిలో పెద్ద సంఖ్యలో మహిళలు కూడా ఉన్నట్లు ఐఎల్‌ఓ తెలిపింది. '2000-2019 కాలంలో శ్రామిక శక్తిలో పురుషుల కంటే మహిళల వాటా తక్కువగా ఉంది. కానీ 2019-2022 మధ్య గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి తారుమారైంది' అని కూడా ఈ నివేదికలో పేర్కొన్నారు. దీని ప్రకారం 'పురుషుల కంటే మహిళలు వ్యవసాయ రంగంలోకి పెద్ద సంఖ్యలో చేరారు. 2022లో వ్యవసాయంలో పనిచేస్తున్న పురుషుల శాతం 38.1 కాగా, మహిళల సంఖ్య 62.8శాతం' అని నివేదిక వివరించి పురుషులు పట్టణాల్లో పనుల కోసం వెతుకుతుంటే మహిళలు గ్రామాలకు చేరి ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే విధంగా ఉపాధి కార్మికులు, నిర్మాణరంగ కార్మికులు పెద్దసంఖ్యలో గ్రామాలకు వచ్చి ఉంటారని ఐఎల్‌ఓ నివేదికలో పేర్కొన్నారు.

అభివృద్ధా -తిరోగమనమా!

పల్లెల నుండి జనం పట్టణాలకు వలసరావడం, పారిశ్రామిక ఉత్పత్తిలో భాగం కావడాన్ని అభివృద్ధిగా భావిస్తారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలతో పాటు, అభివృద్ధి చెందుతున్న దేశాల గణాంకాలు కూడా ఇదే విషయాన్ని చెబుతాయి. మన దేశం కూడా వ్యవసాయ శ్రామిక శక్తిని వ్యవసాయేతర రంగాలకు మార్చడానికి ఎంతగానో ప్రయత్నించింది. నగరాలు, పట్టణాల కేంద్రంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించింది. ఫలితంగా మహానగరాలు, విశ్వనగరాలు ఆవిర్భవించాయి. బతకడానికి వచ్చిన పల్లెజనం కార్మికులుగా స్థిరపడ్డారు. వారితో పాటే పేదరికం స్థిరపడింది. అంతరాలు పెరిగాయి. ఉపాధి లేక, పల్లెలకు బస్తీ జనం పోలోమం టున్నారు. బతకడం కోసం పేదలు ఇలా పల్లెబాట పట్టడాన్ని అభివృద్ధి అంటారా తిరోగమనం అంటారా?

నేడే మేడే

1886 చికాగో అమరవీరులు 8 గంటల పని దినం కోసం సాగించిన పోరాటాలు, వారి త్యాగాల ఫలితంగా మే డేను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకుంటున్నాం. 138 సంవత్సరాల క్రితమే 8 గంటల పని దినాన్ని సాధించుకుని, దేశంలో అనేక కార్మిక చట్టాలు అమలు చేయించుకున్నప్పటికీ భారతదేశంలో మోడీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్మికవర్గంపై దాడి పెరిగింది. ప్రపంచంలోనే అత్యధిక గంటలు పని చేస్తున్న దేశంగా భారతదేశ కార్మికవర్గం రికార్డుల కెక్కింది. మరోవైపు భారతదేశ కార్మికులు అత్యంత హీనమైన వేతనాలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మేడే స్ఫూర్తితో ప్రభుత్వ విధానాలపై మరింత పట్టుదలగా కార్మిక వర్గం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ విధానాల వల్ల రోజురోజుకీ జిల్లాలో పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఏలూరులో అతి పెద్ద పరిశ్రమ, కొన్ని వేల మందికి ఉపాధి చూపించిన ఏలూరు జ్యూట్‌మిల్లు మూతపడింది. నాలుగు వేల మంది పని చేస్తున్న పరిశ్రమ మూతపడినా ప్రభుత్వం దాన్ని తెరిపించేందుకు కనీస ప్రయత్నం చేయలేదు. కార్మికులకు అరకొర పరిహారం ఇచ్చి వదిలించుకున్నారు. అదే బాటలో కొత్తూరు జ్యూట్‌మిల్లు కూడా మూసివేశారు. ఉమ్మడి జిల్లాలో సుగర్ ఫ్యాక్టరీలు, డెల్టా పేపర్ మిల్లు, అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. ఇంత పెద్దఎత్తున పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడ్డా ప్రభుత్వానికి కనీస చలనం ఉండటం లేదు. కార్మిక శాఖ కార్మికులకు చట్టప్రకారం రావాల్సినవి ఇప్పించడంలో, పరిశ్రమలు తిరిగి తెరిపించడంలో చొరవ చేయకుండా చూసీచూడనట్లు వ్యవహరించడంతో కార్మికుల ఉపాధితోపాటు రావాల్సిన నష్ట పరిహారాలు కూడా కోల్పోతున్నారు. పరిశ్రమలు మూత పడినప్పుడు కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. యాజమాన్యాలు లాభాలు వచ్చినంత కాలం అనుభవిస్తూ, ఆస్తులు కూడబెట్టుకుంటూ నష్టం వస్తే కార్మికులపై నెపం మోపుతున్నారు. మరోవైపు ప్రస్తుతం ఉన్న పరిశ్రమల్లో కూడా అత్యధిక శాతం వలస కార్మికులతోనే పనులు చేయిస్తున్నారు. బీహార్, ఒడిశ్శా, ఛత్తీసఘడ్, జార్కండ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల కార్మికులే జిల్లాలో అత్యధిక శాతం పని చేస్తున్నారు. వీరెవరికీ కనీస వేతనాలు ఇస్తున్న దిక్కే లేదు. 12 గంటల నుంచి 14 గంటలపాటు వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ఎవరైనా ప్రమాదవశాత్తూ చనిపోయినా చడీచప్పుడు లేకుండా అర్ధరాత్రి శవాలను ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా తరలిస్తున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కార్మిక చట్టాలు మారుస్తున్నాయి. దానిలో భాగంగా యజమానులకు లాభదాయకంగా, కార్మికులకు ప్రాణ సంకటంగా పరిస్థితులు మారుతున్నాయి. యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాలు సవరించడం, ఫ్యాక్టరీల తనిఖీ అధికారం లేకుండా చేయడం, భద్రత ప్రమాణాలు గాలికి వదిలేయడం, పని గంటలు యజమానుల ఇష్టానికి వదిలేయడం, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ డిపార్టుమెంట్ అధికారాలు కుదించి వారి చేతులు కట్టేయడం వంటి చర్యల వల్ల ఆంధ్ర రాష్ట్రంలో ఏదోమూల ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. అక్కిరెడ్డిగూడెం పోరస్ కెమికల్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 12 మంది కార్మికులు మరణించారు. తాడేపల్లిగూడెం ఫుడ్ ఫ్యాట్స్, పరమేశు బయోటెక్, విజన్ డ్రగ్స్, ఇతర అనేక పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి కార్మికులు మరణించారు. మరణించాక హడావిడిగా నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకోవడం తప్ప ప్రమాదాల నివారణకు చిత్తశుద్ధితో ప్రభుత్వాలు ప్రయత్నించడం లేదు. ప్రమాదాలు జరిగిన చోట కార్మిక సంఘాలు బలంగా ఉంటే పోరాడి నష్టపరిహారాలు సాధిస్తున్నాయి. లేకపోతే యాజమాన్యాలు తూతూమంత్రంగా పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయి. సంపద సృష్టికి మూలం కార్మికులు. వారి శ్రమ మాత్రమే. అయితే నేటి పాలకవర్గాలు సంపద సృష్టికర్తలు కార్పొరేట్ కంపెనీలేనని విశ్వసిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు మారుస్తున్నారు. కార్మికుల జీవితాలు నాశనం చేస్తున్నారు.

ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం తెచ్చిపెడుతున్న ఆక్వా పరిశ్రమ కార్మికులు కనీస వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారు. చేపలు, రొయ్యల చెరువుల్లో పనిచేసే కార్మికులు, ఐస్‌ప్లాంట్లలో పనిచేసే కార్మికులు, ప్రాసెసింగ్ ప్లాంట్, ఫీడ్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు కనీస వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎటువంటి కార్మిక చట్టాలూ అమలు చేయడం లేదు. ప్రమాదవశాత్తు మరణించినా యాజమాన్యాలు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నాయి. ఆటో, రవాణా రంగ కార్మికులు ప్రభుత్వ విధానాల ఫలితంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వయం ఉపాధి పొందుతున్న వారిపై ప్రభుత్వాలు ఇష్టానుసారం రోడ్డు ట్యాక్స్, ఇన్సూరెన్స్ పెంచడం వల్ల భారం తీవ్రంగా పెరుగుతోంది. ఇష్టానుసారం పెనాల్టీలు పెంచి డ్రైవర్లను దోచుకుంటున్నారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వెల్ఫేర్ బోర్డు ద్వారా రావాల్సిన పరిహారాలను చెల్లించకుండా ద్రోహం చేస్తుంది. వెల్ఫేర్ బోర్డు ద్వారా వేల కోట్ల రూపాయలు ఆర్జించిన ప్రభుత్వం, ఆ నిధులను దారి మళ్లించి భవన నిర్మాణ కార్మికులను నట్టేట ముంచింది. మరోవైపు ఇసుక, ఇటుక, ఐరన్, సిమెంట్ తదితర ధరలు ఆకాశాన్నంటడం వల్ల నిర్మాణాలు నిలిచిపోయి ఉపాధి కోల్పోతున్నారు. ముఠా, హమాలీ కార్మికులు వంటి అసంఘటిత కార్మికులకు కనీస భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయివేటు విద్యాసంస్థలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్, ఆటోమొబైల్స్ తదితర సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు ఎటువంటి చట్టాలూ అమలు కాక కట్టు బానిసల్లా పని చేస్తున్నారు. యాజమాన్యాలు కోట్లాది రూపాయల లాభాలు ఆర్జిస్తుంటే వారి వద్ద పనిచేసే సిబ్బందికి మాత్రం కనీస వేతనాలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రిలయన్స్, సిఎంఆర్, డీమార్ట్ వంటి పెద్దపెద్ద సంస్థల్లో 200 నుంచి 300 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. సమస్యలపై అడిగితే వారిని ఉద్యోగం నుంచి తొలగించడమే తరువాయి. అనేక మంది యాజమాన్యాల వేధింపుల వల్ల ఉద్యోగాలు కోల్పోతున్నారు. మరోవైపు జొమాటో, స్విగ్గీ తదితర ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు పెరుగుతున్నాయి. వాటిలో పని చేస్తున్న గిగ్ వర్కర్స్ బాధలు వర్ణనాతీతం. యజమాని ఎవరో తెలియకుండా, వారి మొహం చూడకుండా వారికి శ్రమ మొత్తం దారపోస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మరుసటి రోజు వారికి పని ఉండదు. వెంటనే వారిని యాప్ నుండి డిలీట్ చేస్తారు. ఈ రకంగా కొత్త తరహాలో కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తున్నారు.

ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని వాగ్దానం చేసిన జగన్మోహన్‌రెడ్డి కేవలం మూడు వేల మందిని మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారు. లక్షలాది మంది ఉద్యోగులు నిరాశతో జీవిస్తున్నారు. వేతనాలు కూడా అరకొరగా పెంచి తీరని అన్యాయం చేశాడు. సంక్షేమ పథకాలు కూడా వీరికి అమలు చేయడం లేదు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, గ్రామ రెవెన్యూ సహాయకులు, ఐకెపి విఒఎలు, మున్సిపల్ తదితర రంగాల కార్మికుల సమస్యలను కూడా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. పథకాలు పని చేస్తున్న స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా దోపిడీ చేస్తున్నారు. గౌరవ వేతనం, ప్రోత్సాహకాలు పేరుతో మాత్రమే వేతనాలు ఇస్తున్నారు.

పోరాటాలే శరణ్యం

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ కాలంలో ఆంధ్ర రాష్ట్రంలో వీరోచిత పోరాటాలు నిర్వహించారు. అంగన్వాడీలు 42 రోజులపాటు మొక్కవోని పట్టుదలతో సమ్మె నిర్వహించారు. 42 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వేతనాలు పెంచాలని ఇతర డిమాండ్ల సాధన కోసం సమ్మె నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అదిరించినా, బెదిరించినా బెదరకుండా ధైర్యంగా సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా ఐక్యత పట్టు సడలకుండా అందరూ ధైర్యంగా నిలబడ్డారు. పోలీసు నిర్బంధాలు విధించినా తట్టుకోని నిలబడ్డారు. ఉద్యోగాల నుండి తొలగిస్తున్నట్లు బెదిరించినా లెక్క చేయకుండా ధైర్యంగా పాల్గొన్నారు. ఫలితంగా కొన్ని విజయాలు సాధించారు. చివరికి సమ్మె కాలానికి వేతనం కూడా పొందారు. అదే సమయంలో మున్సిపల్ కార్మికులు 16 రోజులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు 22 రోజులపాటు సమ్మె చేపట్టారు. సమ్మెల వల్ల కార్మికవర్గంలో ఒక విశ్వాసం కలిగింది. ఆశా వర్కర్లు కూడా నిర్బంధాన్ని సైతం తట్టుకుని రాజధానిలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు.

ఈ నేపథ్యంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో కార్మికవర్గానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపి, బిజెపితో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం, జనసేన పార్టీలను, గత ఐదు సంవత్సరాలుగా కార్మిక వర్గంపై అణచివేత చర్యలు చేపట్టిన వైసిపిని ఓడించాలి. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు విజ్ఞప్తి చేస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గంపై దాడి తీవ్రతరం చేసిన నేపథ్యంలో యావత్ కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడం ఒకటే సరైన మార్గం. ఐక్యత–పోరాటం నినాదంతో రానున్న కాలంలో కార్మికవర్గ పోరాటాలు నిర్వహించడం మన ముందున్న ప్రధాన కర్తవ్యం.

– డిఎన్‌విడి.ప్రసాద్,
సిఐటియు
రాష్ట్ర కార్యదర్శి
ఏలూరు